# కుల వివక్షపై కత్తి దూసిన యోధుడు గురు రవిదాస్

## (01 ఫిబ్రవరి "గురు రవిదాస్ జయంతి" సందర్భంగా)

ప్రతి ఏట మాఘ పూర్ణిమ రోజు "గురు రవిదాస్ జయంతి"ని భారతదేశవ్యాప్తంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. అతి ప్రధానమైన భారత సాధువుల్లో ఒకరైన గురు రవిదాస్ భక్తి ఉద్యమాలు, ఆధ్యాత్మిక బోధనలు, కరుణతో నిండిన జీవితం, వివక్షలేని సమాజం, సామాజిక సమానత్వ పోరాటాలు, కుల వ్యవస్థను సవాలు చేయడం లాంటి అంశాలు నేటి పౌర సమాజంపై చెరగని ముద్రను వేసాయి. దేవుడి ఏకత్వ బోధనలు, ఆధ్యాత్మిక స్వచ్ఛత ప్రోత్సాహాలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, భవిష్యత్తులో కాలాతీత సందేశాలుగా ఉంటాయి కూడా. గురు రవిదాస్ జీవనయానం వినయం, భక్తి, కరళత అనే ఇతివృత్తాలతో ముడిపడి ఉన్నది.

### గురు రవిదాస్ జీవితం సమానత్వ భావనలకు అంకితం:

15వ శతాబ్దంలో తక్కువ కుల (తోలు కార్మిక) కుటుంబంలో జన్మించిన గురు రవిదాస్, సాధువుగా మారి సమానత్వం సాధనకు కృషి చేసిన ఆధ్యాత్మిక నాయకుడుగా మనకు తెలుసు. పుట్టుక, కులం, మతం పేర్లతో పౌర సమాజ విభజనలు వ్యతిరేకించిన రవిదాస్ కుటుంబం చెప్పులు కుట్టే పనిలో గడిపేవారు. ఆయన బోధనలు విన్న పండితులు, రారాజులు సహితం ఆయనకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చేవారు. గురు రవిదాస్ తన భక్తి గీతాలతో ప్రసిద్ధి పొందారు. అనేకమైన ఈ గీతాలు సిక్కుల మత గ్రంథమైన "గురు గ్రంథ్ సాహిబ్"లో చేర్చబడ్డాయి. ఆయన కీర్తనలు మతపరమైన సరిహద్దులను దాటి సమానత్వ సాధనకు ఉపకరించాయి. ప్రేమ, ఐక్యత, సమానత్వం అనబడే సందేశాలు నేటికీ లక్షలాది ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సకల జీవుల్లో దేవుడు ఉన్నాడని, దైవం ముందు పెద్ద చిన్న కులాలు లేవని ప్రచారం చేసాడు.

### స్వచ్ఛ హృదయం గంగా నది నీరు వలె పరమ పవిత్రం:

గురు రవిదాస్ బోధనలు అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన జీవితంపై ఆశలు, బలాన్ని అందించాయి. బాహ్య ఆచారాల కంటే భక్తి ఆధారంగా దైవంతో సంబంధం పెట్టుకోవచ్చని వివరించాడు. విగ్రహారాధనను వ్యతిరేకిస్తూ, నిరాకార దేవుని ఏకత్వ భావనను ప్రచారం చేసాడు. గురు రవిదాస్ జయంతి రోజు ఆధ్యాత్మిక చింతన, ఆనంద పూజలు, సమాజ వేడుకలు, నాగర్ కీర్తనలు (ఊరేగింపులు), స్తోత్రాల పఠనం, లంగర్ భోజనాలు, దాతృత్వ కార్యక్రమాలు లాంటివని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. "మీ హృదయం స్వచ్ఛంగా ఉంటే, ఒక చిన్న కుండ నీరు కూడా పవిత్ర గంగా నదిలా పవిత్రం అవుతుంది" అనే ఒక ప్రసిద్ధ సామెతను గురు రవిదాస్ అందించాడు. అంతర్గత స్వచ్ఛతే ఆధ్యాత్మికత, శాంతికి అదే నిజమైన మార్గం అని నొక్కి వక్కాణించిన గురువు మన రవిదాస్. కులమతాలు, సామాజిక వివక్షలకు అతీతంగా ప్రతి ఒక్కరిలో దైవంతో అనుసంధానమయ్యే సామర్థ్యం ఉంటుందని బోధించాడు.

గురు రవిదాస్ బోధనలు నేటికీ సందర్భోచితంగా ఉంటూ, అసమానతలు, వివక్షత, సామాజిక అన్యాయాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి ఒక నైతిక చట్రంగా నిలుస్తున్నాయి.

సమాజ ఐక్యత, కరుణ వ్యాప్తి, నిస్వార్థ సేవాగుణాలను ఆచరిస్తూ గురు రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఫిబ్రవరిలో 50 ఎకరాల ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ పూర్తి కావాలి..

## -పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

కరీంనగర్, జనవరి 31: రాబోయే ఫిబ్రవరి నెలలో 50 ఎకరాల ఫామ్ ఆయిల్ ప్లాంటేషన్ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి మండలం రంగాపూర్, సబ్బితం అనుబంధ



గ్రామం గట్టు సింగారంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా గట్టుసింగారంలో రవీందర్ రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న ఫామ్ ఆయిల్ పంటను ట్రాక్టర్ పై ప్రయాణించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఫామ్ ఆయిల్ పంటను ప్రోత్సహించేందుకు ఇక్కడ గుట్ట పై విద్యుత్ సరఫరా నిమిత్తం రూ.9 లక్షలు కలెక్టర్ ప్రత్యేక నిధుల నుంచి కేటాయించి పనులు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరిలో 50 ఎకరాలలో ఫాం ఆయిల్ మొక్కల నాటే పనులు పూర్తి చేయిలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి జగన్ మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి సోదర వియోగం

కరీంనగర్, జనవరి 31:పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సోదరుడు దాసరి రఘునందన్ రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే దాసరి స్వగ్రామమైన కాసులపల్లికి చేరుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సోదరుడు రఘునందన్ రెడ్డి మృతి వార్త తెలిసిన వెంటనే పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పెద్దపల్లి మండలం కాసులపల్లికి చేరుకుని దాసరి రఘునందన్ రెడ్డి పార్థీవ దేహం పై పూలమాల వేసి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తన ప్రగాఢ సంతాతం తెలుపుతూ సానుభూతి వ్యక్తం చేసి మనోధైర్యంతో ఉండాలని సూచించారు.

# బొట్లవర్తి వనదేవతలకు మొక్కులు సమర్పించిన నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సరిత




కరీంనగర్, జనవరి 31: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొట్ల వనపర్తి గ్రామంలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా శనివారం నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సంగ రంజిత్, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ మోట పలుకుల అశోక్, సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు.

అనంతరం జడ్జి సరిత సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించి మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా జడ్జిని సర్పంచ్, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద శాలువాతో సన్మానించారు. అమ్మవార్లు వెలిసిన జాతర ప్రదేశం వద్ద మామిడి తోట చుట్టూ పరిసరాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉందని భక్తుల సందర్శనకు ఎంతో సౌకర్యవంతంగా ఉందని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి వెంట న్యాయవాదులు బోట్ల లక్ష్మీ నర్సయ్య, ఆకారి రాజేశం, నూనె సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# భూ సరిహద్దుల జియో ట్యాగింగ్‌తో వివాదాలు పరిష్కారం'

నల్గొండ, జనవరి 31: భూ సరిహద్దుల జియో ట్యాగింగ్ వల్ల వివాదాలు తగ్గి, ప్రజలకు భూమిపై పూర్తి హక్కు రికార్డు ఇవ్వడమే భూ భారతి రీ సర్వే ఉద్దేశమని ఆర్డీఓ వేణు మాధవ రావు అన్నారు. భూ భారతి భూముల రీ సర్వేపై పైలెట్ గ్రామంగా జాజిరెడ్డిగూడెం ఎంపిక చేయగా శనివారం అర్వపల్లిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో గ్రామ ప్రజలు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీకాంత్, సర్వే, ల్యాండ్ రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఐఓ ప్రకాష్, ఎంపీడీఓ ఝాన్సీ, మండల సర్వేయర్ వెంకటేష్, ఆర్ఐలు వెంకట్ రెడ్డి, జలంధర్ రావు, ప్రసన్న, సర్పంచులు చిల్లంచర్ల విద్యాసాగర్, కృష్ణమూర్తి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.







# ఆదరించండి.. అందుబాటులో ఉంటా

అమరావతి, జనవరి 31: ఒకటో వార్డు సభ్యులకు అందుబాటులో ఉండి సేవ చేసే అవకాశం ఇవ్వాలని వాక మహేష్ కోరారు. శనివారం ఒకటో వార్డు లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్తిగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు లో ఉన్న ప్రతి ఓటరు అధికార పార్టీ గుర్తు హస్తం కు ఓటు వేయాలని కోరారు. గత మూడేండ్లుగా కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికారం లేకున్నా సేవ చేస్తున్నానని అన్నారు. అందరికి పరిచయం ఉన్న వ్యక్తిగా తనను ఆదరించాలని వేడుకున్నారు.

మున్సిపల్ కౌన్సిలర్ గా ఒకటో వార్డు నుండి తనని గెలిపిస్తే వార్డు లో మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్స్ నిర్మాణం చేయిస్తానని పేర్కొన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునిల్ కుమార్ సహకారంతో ఒకటో వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదేనని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐటీఐల ఆధునీకరణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన పథకం కింద 1000 ప్రభుత్వ ఐటీఐల ఆధునికీకరణ

న్యూఢిల్లీ, జనవరి 31:దేశానికి ఉన్న జనాభా ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మారుతున్న కార్మిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఒక సమగ్రమైన, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న నైపుణ్య వ్యవస్థను తయారుచేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-2026 ఆర్థిక సర్వే తెలిపింది.

నైపుణ్యాల అందుబాటును మెరుగుపరిచేందుకు, వాటి నాణ్యతను మెరుగుపరచడానికి చక్కగా అనుసంధానమైన నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ అవసరమని ఆర్థిక సర్వే పేర్కొంది. నైపుణ్య విధానం అనేది విద్య, కార్మిక మార్కెట్లు, పరిశ్రమల కలయికకు కేంద్రంగా ఉంటుంది. వివిధ సంస్థలు, మంత్రిత్వ శాఖలు, వివిధ స్థాయిలలోని ప్రభుత్వాలు, విద్యార్థులు, అధ్యాపకులు, కార్మికులు, యజమానులు, కార్మిక సంఘాలు, ఇతర సంబంధిత వ్యక్తులతో కూడిన విస్తృత శ్రేణి భాగస్వాముల మధ్య సన్నిహిత సమన్వయం, సహకారం దీనికి అవసరం. పీఎల్ఎఫ్ఎస్ 2023-24 ప్రకారం వృత్తిపరమైన లేదా సాంకేతిక శిక్షణ పొందిన వ్యక్తుల వాటా (15-59 వయస్సు విభాగంలో) 2017-18లో 8.1 శాతం ఉండగా 2023-24 నాటికి 34.7 శాతానికి పెరిగింది. ఇది దేశంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల సానుకూల ప్రభావాన్ని తెలియజేస్తోంది.

భవిష్యత్ నైపుణ్య కోర్సులు ఏఐ, ఐఓటీ, పునరుత్పాదక ఇంధనం, 3డీ ప్రింటింగ్ వంటి రంగాల్లో 31 భవిష్యత్ నైపుణ్య (ఫ్యూచర్ స్కిల్స్) కోర్సులతో సహా 169 కోర్సులను (ట్రేడ్స్) తయారు చేయటం ద్వారా ఎన్ఎస్‌క్యూఎఫ్ ఆమోదిత శిక్షణ విస్తరించింది. ఇవి దేశవ్యాప్త ఐటీఐలు, జాతీయ నైపుణ్య శిక్షణ ద్వారా అందుబాటులో ఉన్నాయి.

### ఐటీఐల ద్వారా నైపుణ్యాభివృద్ధి వ్యవస్థ బలోపేతం

శిక్షణ నాణ్యతతో పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఉండటం, సంస్థాగత సామర్థ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి సారిస్తూ ఐటీఐ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను సంస్కరణలు బలోపేతం చేస్తున్నాయి. స్మార్ట్ తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ కంటెంట్, పరిశ్రమలకు అనుగుణంగా ఉండే దీర్ఘకాలిక - స్వల్పకాలిక కోర్సుల ద్వారా 200 హబ్ ఐటీఐలు, 800 స్పోక్ ఐటీఐలతో సహా మొత్తం 1,000 ప్రభుత్వ ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయాలని ఐటీఐల ఆధునీకరణ కోసం ఉద్దేశించిన జాతీయ పథకం ప్రతిపాదించింది.

### పరిశ్రమల అవసరాలకు నైపుణ్యాభివృద్ధిని అనుసంధానించడం

పాఠ్యాంశాలు, శిక్షణ, అప్రెంటిస్‌షిప్‌లు, మూల్యాంకనాల్లో పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించడం అనేది నైపుణ్యాభివృద్ధిని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మార్చాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. సంస్థలు, ప్రమాణాలు, కార్యక్రమాల పర్యవేక్షణ అంతటా పరిశ్రమలను భాగస్వామ్యం చేయటం వల్ల శిక్షణకు ఉన్న ప్రాముఖ్యత, విశ్వసనీయత పెరుగుతుంది. దీనిని గుర్తిస్తూ పీఎంకేవీవై 4.0 కింద పరిశ్రమల నేతృత్వంలోని సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ (ఎస్ఎస్‌సీ) అభివృద్ధి చేసిన నైపుణ్య శిక్షణను ఎన్ఎస్‌క్యూఎఫ్ సంబంధిత ఉద్యోగాల విషయంలో అందిస్తున్నారు. అలాగే అనేక కోర్సులను నేరుగా పరిశ్రమ ప్రాంగణాల్లోనే ఆయా యజమాన్య సంస్థలకు చెందిన శిక్షకుల ద్వారా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా క్రమం తప్పకుండా నిర్వహించే ఉద్యోగ మేళాలు, నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాలు యజమానులకు, ఉద్యోగార్థులకు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తున్నాయి.

### యజమానులు, ఉద్యోగార్థులను అనుసంధానించటం

క్రమం తప్పకుండా నిర్వహించే ఉద్యోగ మేళాలు, నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాలు యజమానులకు, ఉద్యోగార్థులకు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయని ఆర్థిక సర్వే తెలిపింది. డిజిటల్ సాంకేతికతలు, హరిత ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, అధునాతన వ్యవసాయం, ఆర్థిక సేవలు, ఈ-కామర్స్ రంగాలపై పీఎంకేవీవై 4.0 చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ అనేది భారతదేశ దీర్ఘకాలిక వృద్ధి చోదక శక్తులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న కొత్త అవకాశాల వైపు నైపుణ్యాభివృద్ధి పెట్టుబడులను మళ్లించడానికి జరుగుతున్న ఒక క్రమబద్ధమైన ప్రయత్నాన్ని తెలియజేస్తున్నాయి.

ఎస్ఐడీహెచ్, ఎన్‌సీఎస్, ఈ-శ్రమ్ పోర్టల్‌ల అనుసంధానం ఒక పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించింది. దీనిని తక్షణ పర్యవేక్షణ, శిక్షణ రికార్డులను ఉపాధి ఫలితాలతో అనుసంధానించడం, యజమానుల డిమాండ్- వ్యక్తిగత నైపుణ్య ప్రయాణాలను అంచనా వేయడానికి ఉపయోగించుకోవచ్చు.

### భారతదేశ అప్రెంటిస్‌షిప్ వ్యవస్థ

భారతదేశ అప్రెంటిస్‌షిప్ వ్యవస్థ కూడా విధానపరమైన, నిర్మాణాత్మక పరివర్తనకు లోనైంది. జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రోత్సాహక పథకం (ఎన్ఏపీఎస్), ఎన్ఏటీఎస్ కార్యక్రమాలు విస్తృత శ్రేణి రంగాలు, సంస్థలకు వర్తించేలా విస్తరణకు గురయ్యాయి. పీఎం-ఎన్ఏపీఎస్ కింద 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 43.47 లక్షల మందికి పైగా అప్రెంటిస్‌లు పనిచేస్తున్నారు. ఇందులో 51,000 కంటే ఎక్కువ సంస్థలు భాగస్వామ్యం కాగా.. మహిళల భాగస్వామ్యం 20 శాతానికి చేరుకుంది. ఎన్ఏటీఎస్ కార్యక్రమం కూడా 2025 ఆర్థిక సంవత్సరంలో 5.23 లక్షల మంది అప్రెంటిస్‌ల నియామకాన్ని నమోదు చేసింది. ఇది భారతదేశ అప్రెంటిస్‌షిప్ వ్యవస్థ విషయంలో విస్తరిస్తున్న పరిధి, సంస్థాగత పరిపక్వతను తెలియజేస్తోంది.

### భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలు

వృద్ధి ప్రయాణంలో భారత్ ముందుకు సాగుతున్న వేళ సంస్థాగత సమన్వయాన్ని పెంపొందించడం, ఏకోన్ముఖ ప్రభుత్వం అనే దృక్పథాన్ని ప్రోత్సహించడం వల్ల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కార్యక్రమాలు పరస్పర సహకారంతో, సమన్వయ పద్ధతిలో పనిచేయడానికి వీలవుతుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాన్ని అందించడంపై మరింత దృష్టి సారించడానికి ఇది వేదికను సిద్ధం చేస్తుంది. ఉద్యోగాలకు సిద్ధంగా ఉన్న మానవ వనరులను తయారుచేసేందుకు, నైపుణ్యం -పరిశ్రమ అనుసంధానాలను బలోపేతం చేయడానికి ఇదే కేంద్రబిందువుగా నిలుస్తుంది.

# తెలంగాణ తెచ్చిన నేత కేసీఆర్‌ను వేధించడం అప్రజాస్వామికం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సిద్దిపేట జిల్లా, జనవరి 31: సిద్దిపేట పట్టణంలోని రంగదాంపల్లి అమరవీరుల స్థూపం దగ్గర బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెలిఫోన్ ట్యాపింగ్ పేరుతో బీఆర్ఎస్‌పై వేధింపులు సీరియల్ తరహాలో కొనసాగుతున్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కదారి పట్టించి ప్రతిపక్ష నాయకులను వేధి స్తున్నాడని విమర్శించారు. అలీబాబా 40 దొంగలు, దండుపాల్యం ముఠా తరహాలో కాంగ్రెస్ నాయకులు అనేక కుంభకోణాలు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. బొగ్గు స్కామ్, 9 వేల ఎకరాల భూ స్కామ్, ఇలా అనేక స్కామ్‌లు చేశారని చెప్పారు. ఆ స్కామ్‌ల నుంచి ప్రజల దృష్టి మళ్లించడం కోసం రేవంత్ రెడ్డి ఈ నాటకాలు ఆడుతున్నాడని అన్నారు. రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుల గొంతు నొక్కడం కోసం సిట్ పేరిట కుట్రలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదని చెప్పారు.

1875 లోనే ట్యాపింగ్‌పై చట్టం వచ్చిందని, టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం పోలీస్‌శాఖ సమాచారం సేకరిస్తుందని తెలిపారు. ఏ ముఖ్యమంత్రి కూడా ట్యాపింగ్ చేయమని ఎవరికి చెప్పరని, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసం సిట్ వేశారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. విచారణ జరుగుతున్న క్రమంలో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకి లీకులు ఇస్తున్నారని విమర్శించారు. తెలంగాణ తెచ్చిన నేత కేసీఆర్‌ను వేధించడం అప్రజాస్వామికమని అన్నారు. 14 ఏండ్లు మడమ తిప్పని పోరాటం చేసి తెలంగాణ తేవడమే కేసీఆర్ చేసిన నేరమా..? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కక్ష్యతోనే కేసీఆర్‌కు నోటీసులు ఇనస్తా వేధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణకు రమ్మని.. కొండా సురేఖ, సీతక్కలు సమ్మక్క సారలమ్మ జాతరకు రమ్మని ఎర్రవెల్లికి వెళ్ళి ఆహ్వానించారని, కానీ పోలీస్ అధికారులు మాత్రం నందినగర్ ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారని, ఇది దుర్మార్గమైన చర్య అని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ప్రతీకార వాంఛతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. ఎలక్షన్ అఫిడవిట్‌లో హరీష్ రావు అడ్రస్ సిద్దిపేటలో ఉంటే హైదరాబాద్ ఇంటి అడ్రస్‌కి నోటీస్ ఇచ్చారని అన్నారు. కేసీఆర్‌కి మాత్రం హైదరాబాద్‌లో నోటీస్ ఇచ్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి ఇంటి అడ్రస్ కొడంగల్ అయితే గతంలో అధికారులు హైదరాబాద్లో నోటీస్ ఇచ్చారని, కేసీఆర్ విషయంలో మాత్రం వివక్ష చూపుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు శిక్ష వేయడం ఖాయమని హెచ్చరించారు.

# ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ (పీఎంఏవై-యూ) కింద రెండు దశల్లో 122.06 లక్షల గృహాలు మంజూరు

న్యూఢిల్లీ, జనవరి 31: "భారత నగరాలు కేవలం నివాస స్థలాలు మాత్రమే కాదు... కీలకమైన ఆర్థిక మౌలిక సదుపాయాలుగా కూడా పనిచేస్తాయి. సాంద్రత, సామీప్యతలు ఉత్పాదకతను పెంచే, కార్మిక మార్కెట్లను బలోపేతం చేసే, ఆవిష్కరణలకు వీలు కల్పించే నగర ఆర్థిక వ్యవస్థలను సృష్టిస్తాయి. అందువల్ల నగరాల ఆర్థిక పాత్ర భారత వృద్ధి పథానికి కేంద్రంగా ఉంది" అని కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2025-26 ఆర్థిక సర్వే పేర్కొంది.

భారత్‌లో ఇప్పటికే ఆర్థికంగా చాలా పట్టణీకరణ జరిగిందని, దేశ జాతీయ ఉత్పత్తిలో ఎక్కువ భాగం నగరాలు, పట్టణ ప్రాంతాల నుంచే జరుగుతోందని 2025-26 ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఇప్పుడు ఈ పట్టణీకరణతో పౌరులకు ప్రత్యక్ష, పరోక్ష మార్గాల్లో మెరుగైన రీతిలో ప్రయోజనం కలిగించేలా చేయడం మన కర్తవ్యం.

నగరాలను ప్రణాళికయుత పెట్టుబడి, వ్యూహాత్మక ప్రణాళికలు అవసరమైన ఆర్థిక ఆస్తులుగా సర్వే ప్రస్తావించింది. పబ్లిక్ పాలసీ, ఆర్థిక ప్రాధాన్యాలు, ప్రణాళిక విధానాలను భారత వృద్ధి పథానికి అనుగుణంగా ఉంచేందుకు నగరాలను ఆర్థిక మౌలిక సదుపాయాలుగా గుర్తించడం అవసరమైన మొదటి చర్యగా సర్వే పేర్కొన్నది.

**నగరాలు వృద్ధి ఇంజిన్‌లు**

2025-26 ఆర్థిక సర్వే ప్రకారం... భారత్‌లో అధికారిక నిర్వచనాలు సూచించిన దానికి మించి ఆర్థికంగా, కార్యాచరణ పరంగా చాలా ఎక్కువ పట్టణీకరణ జరిగింది. యూరోపియన్ కమిషన్‌లోని గ్రూప్ ఆన్ ఎర్త్ అబ్జర్వేషన్స్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్ లేయర్ (జీహెచ్ఎస్ఎల్) అందించిన ఉపగ్రహ డేటా ప్రకారం భారత్‌లో 2015 నాటికి 63 శాతం పట్టణీకరణ జరిగింది. ఇది 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదించిన పట్టణీకరణ రేటుకు దాదాపు రెట్టింపు.

2011 నాటికి దేశంలో పట్టణ జనాభా 31 శాతంగా ఉండగా, 2036 నాటికి 60 కోట్ల మందికి అంటే దేశ జనాభాలో 40 శాతం మందికి పట్టణాలు, నగరాలు నివాసంగా ఉంటాయని... జీడీపీలో పట్టణ ప్రాంతాల వాటా సుమారుగా 70 శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసినట్లు ఆర్థిక సర్వే పేర్కొంది.

**రవాణా**

గత దశాబ్ద కాలంలో భారత్ వేగవంతమైన రవాణా వ్యవస్థను భారీ స్థాయిలో భౌతికంగా విస్తరించిందని 2025-26 ఆర్థిక సర్వే పేర్కొంది. 2025 నాటికి, దాదాపు 24 నగరాల్లో దాదాపు 1,036 కిలోమీటర్ల మార్గంలో మెట్రో/ఆర్ఆర్ టీఎస్‌లు పనిచేస్తుండగా, మరిన్ని కారిడార్లు నిర్మాణంలో ఉన్నాయి.

10,000 ఇ-బస్సులతో సిటీ బస్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం పీఎమ్ ఇ-బస్ సేవను ప్రారంభించిందని ఆర్థిక సర్వే తెలిపింది. రూ. 20,000 కోట్ల కేంద్ర సహాయం, ఆపరేటర్‌లకు సరిపడా ఆదాయాన్ని నిర్ధారించడానికి చెల్లింపు భద్రతా యంత్రాంగం (పీఎస్ఎమ్) మద్దతుతో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానం ద్వారా దీనిని చేపట్టారు. 2025 ఆర్థిక సంవత్సరంలో 14 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లో 7,293 ఇ-బస్సులు ఆమోదం పొందగా... డిపోలు, బిహైండ్ ద మీటర్ (బీటీఎమ్) ఇంధన మౌలిక సదుపాయాల కోసం రూ. 983.75 కోట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే రూ. 437.5 కోట్లు పంపిణీ అయ్యాయి.

ఫలితాలను మరింత మెరుగుపరచడానికి బస్సుల సంఖ్యను పెంచడం, అధునాతన సాంకేతికతలను సమీకృతం చేయడం ద్వారా ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికీకరించాలని... రవాణా ఖర్చుల తగ్గింపు కోసం విద్యుత్‌తో నడిచే బస్సులను విస్తరించాలని... డిమాండ్ ఆధారిత, భాగస్వామ్య రవాణాను అమలు చేయాలని... రవాణా-ఆధారిత అభివృద్ధి (టీవోడీ) కార్యాచరణ చేపట్టాలని... స్టేషన్ల చుట్టూ భూమిని విస్తరించడం ద్వారా వాటి విలువను పెంచుకోవాలని 2025-26 ఆర్థిక సర్వే సూచించింది.

**పట్టణ పరిశుభ్రత**

గత దశాబ్దంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (ఎస్‌బీఎమ్-యూ) కింద ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద పారిశుధ్య, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల్లో ఒకదాన్ని చేపట్టిందనీ... దీనికి అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్), అమృత్ 2.0 కింద పెట్టుబడులు తోడయ్యాయని 2025-26 ఆర్థిక సర్వే హైలైట్ చేసింది. ఈ చర్యలు పారిశుధ్య ఫలితాల్లో స్పష్టమైన ప్రయోజనాలను అందించాయి, వాటిలో ముఖ్యమైనది అన్ని నగరాల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలన.

2014-15లో మున్సిపల్ ఘన వ్యర్థాల (ఎమ్ఎస్‌డబ్ల్యూ) ఇంటింటి సేకరణ అత్యంత తక్కువగా ఉండగా, 2025?26 నాటికి అది 98 శాతం పట్టణ వార్డులకు విస్తరించిందనీ... దేశవ్యాప్తంగా 2.5 లక్షలకు పైగా వ్యర్థాల సేకరణ వాహనాలు దీని కోసం పని చేస్తున్నాయని సర్వే తెలిపింది.

**సాంకేతికత వినియోగం ద్వారా నగర అభివృద్ధి**

2025 మే 9 నాటికి, స్మార్ట్ సిటీస్ మిషన్ (ఎస్‌సీఎమ్) కింద ఉన్న నగరాలు ప్రణాళికాయుత ప్రాజెక్టుల్లో గణనీయమైన భాగాన్ని పూర్తి చేశాయని సర్వే పేర్కొంది. వాటిలో స్మార్ట్ రహదారులు, సైకిల్ ట్రాక్‌లు, కమాండ్-కంట్రోల్ సెంటర్లు, అభివృద్ధి చేసిన నీటి పారుదల, మురుగునీటి పారుదల నెట్‌వర్క్‌లు, ఉల్లాసభరితమైన పబ్లిక్ ప్రదేశాలూ ఉన్నాయి. దాదాపు 8,067 ప్రాజెక్టుల్లో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. వీటి కోసం దాదాపు రూ. 1.64 లక్షల కోట్ల పెట్టుబడులను వెచ్చించారు.

పట్టణ ప్రాంతాల్లో సరసమైన గృహనిర్మాణానికి మద్దతు నివ్వడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో... ప్రత్యక్ష పన్ను, జీఎస్టీ ప్రయోజనాలు... ప్రాధాన్య రంగ రుణాల్లో (పీఎస్ఎల్) చేర్చడం... మౌలిక సదుపాయాల హోదా కల్పించడం వంటివి భాగంగా ఉన్నాయి. ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ (పీఎమ్ఏవై-యూ) రెండు దశల కింద, మొత్తం 122.06 లక్షల ఇళ్ళు మంజూరయ్యాయి. వీటిలో దేశవ్యాప్తంగా 96.02 లక్షల గృహాలను 24.11.2025 నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు.

పట్టణ వీధి వ్యాపారుల (ఎస్‌వీల) జీవనోపాధిని పునరుద్ధరించడం, బలోపేతం చేయడంలో ప్రధానమంత్రి వీధి విక్రేతల ఆత్మనిర్భర్ నిధి (పీఎమ్ స్వనిధి) కీలక పాత్ర పోషించిందని సర్వే వివరించింది.

పట్టణ రోజువారీ పాలనలో నియమాల కచ్చితత్వాన్ని విశ్వసనీయం చేయడానికి ఆదేశాలను సమకాలీకరించడం, ఫలితాలకు బాధ్యులను స్పష్టం చేయడం, తాత్కాలిక జోక్యం నుంచి సాధారణ అమలును నిరోధించడం చాలా ముఖ్యమైనవిగా సర్వే పేర్కొంది.

**ప్రణాళిక, పరిపాలన, ఆర్థిక చేయూత**

నగర, పట్టణాభివృద్ధికి అవసరమైన ఆర్థిక అవసరాలను తీర్చడానికి భారత ప్రభుత్వం అనేక సమష్టి ప్రయత్నాలను చేపట్టింది. 2023?24 కేంద్ర బడ్జెట్‌లో రూ. 10,000 కోట్ల ప్రారంభ వ్యయంతో అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ నిధి (యూఐడీఎఫ్)ని ప్రకటించింది. క్రెడిట్ అర్హత లేనప్పటికీ ఆచరణీయ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కలిగి ఉన్న టయర్-2, టయర్-3 నగరాలకు మద్దతునివ్వడానికి ఆర్థిక సంస్థల ద్వారా మళ్లించిన రివాల్వింగ్ ఫండ్‌గా దీనిని రూపొందించినట్లు ఆర్థిక సర్వే 2025-26 తెలిపింది. అందించినప్పుడు అవి అత్యుత్తమ ఫలితాలనిస్తాయి.

గృహనిర్మాణం, రవాణా, పారిశుధ్యం, వాతావరణ పరిస్థితులను తట్టుకోగలగడం, ఆర్థిక రంగాల ఏకీకృతం ద్వారా స్వతంత్ర ప్రాజెక్టుల కంటే వ్యవస్థ పనితీరుకే భవిష్యత్ పట్టణ విధానం ప్రాధాన్యమివ్వాలి. అదే సమయంలో సమగ్రతను, దీర్ఘకాలిక ఆర్థిక సామర్థ్యాన్ని సమర్థించే జీవించదగిన, అన్ని రకాల వాతావరణానికి సిద్ధంగా ఉన్న నగరాలకు రూపకల్పన చేయాలి.

భారత పట్టణ భవిష్యత్తును నిర్మించే వ్యూహాత్మక ప్రయత్నం... మన నగరాలను ఆర్థిక చైతన్యం, సామాజిక సమగ్రత, పర్యావరణ సుస్థిరత, సంస్థాగత సామర్థ్యం కలిగి ఉండేలా చేయడమేనని ఆర్థిక సర్వే 2025-26 పేర్కొంది

# నేటి నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో యాప్ ద్వారానే యూరియా అమ్మకాలు'

## - డీఏఓ బాబురావు

ఖమ్మం, జనవరి 31: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేటి నుండి యూరియాని రైతులకు యాప్ ద్వారానే అమ్మాలని డీఏఓ బాబురావు అన్నారు. శనివారం ఇల్లెందు పట్టణంలో పలు ఎరువుల దుకాణాలను స్థానిక ఏఓ సతీష్ తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల దుకాణం డీలర్లతో మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులకు యూరియా బుకింగ్ యాప్ పై అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల కోసం వచ్చిన రైతులతో మాట్లాడుతూ నేటి నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ముందుగానే యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

మొబైల్ ఫోన్ లేనివారు ఎవరి మొబైల్ నుండైనా యాప్‌లో బుకింగ్ చేసుకున్నా యూరియా తీసుకెళ్లవచ్చు అని తెలిపారు, ఎవరైనా బుక్ చేసిన 24 గంటల్లో యూరియాను తీసుకెళ్లాలని సూచించారు. రైతులకు దీనివల్ల సమయం ఆదా అవుతుందన్నారు. సకాలంలో ఎరువులు తెచ్చుకుని పంటలకు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓలు, ఎరువుల షాపు డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్స్ నెలకు రూ.700 కోట్ల నుంచి రూ.1,500 కోట్లకు పెంచాలి

## - టీజీవో సెంట్రల్ కమిటీ డిమాండ్




ములుగు, జనవరి 31: ఉద్యోగులకు పెండింగ్ బిల్స్‌ను నెలకు రూ. 700 కోట్ల నుంచి రూ. 1,500 కోట్లకు పెంచాలని శనివారం ములుగు జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడారు.

పెన్షనర్ల బకాయిలూ ఏకమొత్తంగా ఒకేసారి చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీపీ రిపోర్టును వెంటనే తెప్పించుకుని ఉద్యోగులకు 42 శాతం ఫిట్మెంట్‌ను ఇచ్చి తెలంగాణ రెండవ పీఆర్సీని అమలు చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానించామని వివరించారు.

ప్రభుత్వం ప్రకటించిన మేరకు ప్రభుత్వం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తిలో చేసి ఉద్యోగుల ఆరోగ్య పథకం విధి, విధానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.ఉపేందర్ రెడ్డి, కోశాధికారి సహదేవ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# 'ఏదులాపురం మున్సిపోల్ లో బీఆర్ఎస్ కూటమి విజయం ఖాయం'

-ప్రభుత్వ వ్యతిరేఖతే ప్రధాన ఆయుధం
-ప్రతి వార్డులో బీఆర్ఎస్ జన ప్రభంజనం
-బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి

ఖమ్మం రూరల్, జనవరి 31 : ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్- సిపిఎం కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, పాలేరు మాజీ



ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించిన సిపిఎం, బీఆర్ఎస్ పార్టీల సమీక్ష సమావేశం 22వ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తాతా మధు, కందాలతో పాటు సిపిఎం నేతలు బండి రమేష్, నంద్ర ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. మున్సిపాలిటీ ప్రతి వార్డులో బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టేందుకు ఓటర్లు వేచి చూస్తున్నారన్నారు. ఇప్పటికే అనేక సర్వేల్లో అధికార పార్టీ ప్రజా వ్యతిరేకత బయటపడిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పాలన వ్యతిరేకత ప్రధాన ఆయుధంగా మారబోతుందని తెలిపారు.

చేపట్టిన అనేక అభివృద్ధి పథకాలు, పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను మున్సిపాలిటీ ప్రజలు ఎప్పటికీ మరువబోరని అన్నారు. నాటి పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, అప్పటి సీఎం కేసీఆర్ ఈ ప్రాంతానికి జేఎన్టీయూ కళాశాలతో పాటు నర్సింగ్ కళాశాల, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను మంజూరు చేయడంతో పాటు నిధులను సైతం విడుదల చేసిన సంగతి తెలిసిందే అన్నారు. అయితే ఆ పనులను సైతం తాను చేసినట్టు ఇక్కడి ప్రాంత ఎమ్మెల్యే, మంత్రి గొప్పలు చెప్పుకుని కొబ్బరికాయలు కొట్టడం సిగ్గుచేటు అన్నారు. ఇటీవల ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీకి కనీసం ఒక చెత్త సేకరణ బండిని సైతం ఏర్పాటు చేయలేదని, అదనంగా ఒక్క పారిశుధ్య కార్మికుడిని సైతం నియమించలేని నాయకులు రాబోయే రోజుల్లో ఆదర్శ మున్సిపాలిటీ చేస్తామని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు.కాబోతోంది.. రాబోతుంది అనే పదాలు తప్పా రెండున్నర ఏళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి చేసిందేమి లేదని దుయ్యబట్టారు. అమలు కానీ అబద్ధపు నాటి ఎన్నికల హామీలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని, వచ్చే పది రోజులు నాయకులు అప్రమత్తంగా ఉండి ఓటర్లకు ఈ విషయాలను చేరవేయాలన్నారు. బీఆర్ఎస్, సీపీఎం శ్రేణులు ఐక్యత, సమన్వయంతో పనిచేసి అద్భుత ఫలితాన్ని సాధించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, బీఆర్ఎస్ నేత జీవన్ కుమార్, సిపిఎం నాయకులు ప్రసాద్, ఎర్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బంతిపూల వనంలో గంజాయి మొక్కలు.. పూజారి అరెస్ట్..

సంగారెడ్డి, జనవరి 31: ఆయన ఒక పూజారి. నిత్యం భగవంతుడిని ఆరాధించే వ్యక్తి. మంచినే పాటిస్తూ చెడును త్యజించాల్సిన వ్యక్తి. మంచిచెడుల వ్యత్యాసాలను నలుగురికి వివరించి చెప్పాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తి. కానీ ఆయనే తప్పుపని చేశాడు. ఏకంగా బంతిపూల వనంలో గంజాయి మొక్కలు పెంచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ బంతిపూల వనంపై రైడ్ చేసి పట్టుకున్నారు.

బంతి మొక్కల నడుమ ఉన్న గంజాయి మొక్కలను చూసి ఖంగుతిన్నారు. ఆ గంజాయి మొక్కలు అన్నింటినీ పీకి విలువ కట్టారు. వాటి విలువ సుమారుగా రూ. 70 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని పంచగం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని దేవాలయం ప్రాంగణంలోగల బంతిపూల మొక్కల్లో పూజారి ఈ గంజాయి మొక్కలను పెంచారు.

# గుంటూరు మెడికల్ కాలేజీలో సుశ్రుత మహర్షి విగ్రహం



గుంటూరు, జనవరి 31: గుంటూరు మెడికల్ కాలేజీ (ఉఓఅ) ప్రాంగణంలో శస్త్రచికిత్స పితామహుడు సుశ్రుత మహర్షి విగ్రహాన్ని శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

భారతదేశంలో పలు శస్త్రచికిత్స విధానాలకు సుశ్రుత మహర్షి ఆద్యుడు అని గుర్తు చేశారు. అలాంటి మహనీయుని విగ్రహం ఉఓఅలో ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అలాగే డా. రాజా కరణం గారి సతీమణి డా. నిర్మలా కరణం విగ్రహ ప్రతిష్ఠ, ఉఓఅ ప్రాంగణంలోని అంఫీథియేటర్ ప్రారంభానికి డా. రాజా కరణం గారి పాత్ర ఎంతో ప్రముఖమని అన్నారు. బొంగడాల బీడు ప్రాంతంలో వైద్యరంగానికి ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నో సేవా కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న డా. రాజా కరణం గారిని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఆయునను మంత్రి సత్కరించారు.

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లక్షలాది మందికి వైద్యసేవలు అందిస్తూ ఎప్పటికప్పుడు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. పుట్టిన గడ్డపై ప్రేమతో ఎంతోమంది ఎన్నారైలు ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని, అందులో డా. రాజా కరణం గారి పాత్ర విశేషమని అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సుశ్రుత మహర్షి విగ్రహం ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉందని తెలిపారు.

సుశ్రుత మహర్షి విగ్రహం భారతదేశంలో రెండోది గుంటూరు మెడికల్ కాలేజీలో ప్రతిష్ఠించడం గర్వంగా ఉందని డా. రాజా కరణం అన్నారు. బిజీ షెడ్యూల్ మధ్య కూడా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా హాజరుకావడం విశేషమని చెప్పారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ యశస్వి రమణ, కార్పొరేటర్ పోతురాజు సమత, జింకన్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ అంతటా వైసీపీ ఆధ్వర్యంలో పాప ప్రక్షాళన పూజలు

అమరావతి , జనవరి 31: తిరుమల లడ్డూ లో జంతువుల కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన తప్పుడు ఆరోపణలపై వైసీపీ శనివారం పాప ప్రక్షాళన పూజలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించింది .ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలు హిందువుల మనోభావాలతో ఆటలు ఆడుకున్నారని ఆరోపించారు. జంతువుల కొవ్వు కలపలేదని సీబీఐ కూడా తేల్చి చెప్పిందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం, డిప్యూటీ సీఎం , మంత్రులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

విశాఖపట్నం సీతమ్మధార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

తిరుపతి లడ్డూపై తప్పుడు ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడా వ్యవస్థ: హరి రంజన్ రావు, కార్యదర్శి, కేంద్ర క్రీడా శాఖ

న్యూఢిల్లీ, జనవరి 31:ఢిల్లీలోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్ఏఐ- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రధాన కార్యాలయంలో క్రీడా శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు నేతృత్వంలోని క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో అంతర్జాతీయ ఒలింపిక్ అకాడమీ (ఐఓఏ) డైరెక్టర్ శ్రీ మాకిస్ అసిమా కోపాలోస్, శ్రీ ఎంఎస్ అలెగ్జాండ్రా కరైస్కోలతో కూడిన ఇద్దరు సభ్యుల ప్రతినిధి బృందం సమావేశమైంది.

ఈ సమావేశంలో అసిమా కోపాలోస్ మాట్లాడుతూ.. "ఒలింపిక్ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించడానికి క్రీడా మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రణాళిక, వ్యూహం, దార్శనికతను ఆకట్టుకుంది" అని అన్నారు.

ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమాలన్నింటినీ చూసిన తర్వాత దేశంలో ఒలింపిక్ విద్యను బలోపేతం చేసే విషయంలో మద్దతునిచ్చేందుకు ఐఓఏ ఆసక్తిగా ఉందని ఆయన తెలిపారు. "భారత్‌లోని యువతకు ఒలింపిక్ విలువలను అర్థం చేసుకునేందుకు వీలుగా క్రీడా వ్యవస్థలోని వ్యక్తులకు ఒలింపిజం, ఒలింపిక్ క్రీడల విలువలపై శిక్షణ ఇవ్వడానికి మేం మా నిపుణతను అందించాలనుకుంటున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

భారతీయ కోచ్‌లు, క్రీడా శాస్త్ర నిపుణులు, పీఈ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమాల ద్వారా దేశంలో క్రీడా విద్యను బలోపేతం చేసేందుకు భారత ఒలింపిక్ అసోసియేషన్, కొత్తగా పునరుద్ధరించిన జాతీయ ఒలింపిక్ అకాడమీ, క్రీడా మంత్రిత్వ శాఖకు ఐఓఏతో భాగస్వామ్యం ఏర్పాటు చేయటం గురించి చర్చించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

1961లో ఏర్పాటైన ఐఓఏ గ్రీస్‌లోని ప్రాచీన ఒలింపియా కేంద్రంగా పనిచేస్తుంది. ఒలింపిక్ విద్య, అధ్యయనాలను ప్రోత్సహించే ప్రపంచంలోని ఏకైక సంస్థ ఇది. భారత్‌లో ఇటీవల పునరుద్ధరించిన జాతీయ ఒలింపిక్ అకాడమీతో సహా వివిధ దేశాలలో జాతీయ అకాడమీలతో ఇది అనుసంధానమై ఉంది.

సమావేశం గురించి ఎంఎస్ అలెగ్జాండ్రా మాట్లాడుతూ.. "మా మధ్య చాలా ఫలప్రదమైన చర్చ జరిగింది. క్రీడా శాఖ కార్యదర్శి చేసిన ప్రెజెంటేషన్ ద్వారా కామన్వెల్త్ క్రీడల నిర్వహణ, 2036 ఒలింపిక్స్ వేలం కోసం భారత్ వేస్తోన్న ఖచ్చితమైన అడుగులను మేం తెలుసుకున్నాం. చాలా కాలం తర్వాత భారత్‌లో జాతీయ ఒలింపిక్ అకాడమీని పునరుద్ధరించటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఒలింపిక్ విలువలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా, ఐఓఏలతో కలిసి పని చేస్తామని ఆశిస్తున్నాం'' అని వ్యాఖ్యానించారు.

సమావేశం అందించిన ఫలితాలను వివరించిన హరి రంజన్ రావు.. "మా మొదటి సమావేశం చాలా విజయవంతమైంది. ఐఓఏకు ఉన్న సుదీర్ఘ అనుభవాన్ని ఉపయోగించుకొని మన క్రీడా విద్యను మరింత బలోపేతం చేయడానికి ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని మేం భావిస్తున్నాం. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో క్రీడా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది కాబట్టి ఒలింపిక్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లగల నిపుణులను తయారు చేయడం ఇప్పుడు చాలా కీలకం" అని పేర్కొన్నారు.

భారత్‌కు సరిపోయే ప్రపంచ స్థాయి పాఠ్యాంశాలను రూపొందించడం, ప్రముఖ విద్యా సంస్థలలో నైపుణ్యాభివృద్ధిని విస్తరించడం, నిర్వాహకుల కోసం ధ్రువపత్రాలతో కూడిన కోర్సులను ప్రారంభించడం, అంతర్జాతీయ నిపుణులతో మాస్టర్ తరగతులను నిర్వహించడం, సంయుక్త పరిశోధన, డిజిటల్ భాగస్వామ్యాల ద్వారా దేశంలో ఒలింపిక్ విద్యకు ఐఓఏ మద్దతు ఇస్తుందని శ్రీ హరి రంజన్ రావు తెలిపారు.

ప్రపంచంలోని జాతీయ ఒలింపిక్ అకాడమీల కోసం దేశంలో ఒక సదస్సును నిర్వహించనున్నట్లు భారత్ ప్రతిపాదించింది. ఒలింపిక్ విద్య, వారసత్వ విజ్ఞాన మార్పిడి కోసం హెలెనిక్ ఒలింపిక్ కమిటీతో (హెచ్ఓసీ) సహకారంపై చర్చలు జరుగుతున్నాయి.

# విశాఖపట్నంలో రూ. 32 కోట్ల విలువైన సీఎస్ఐఆర్-ఎన్ఐవో తీరప్రాంత

## -ఆధారిత ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ జితేంద్ర సింగ్




న్యూఢిల్లీ, జనవరి 31:విశాఖపట్నంలోని సీఎస్ఐ ఆర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో) ప్రాంతీయ కేంద్ర తీరప్రాంత ఆధారిత ప్రయోగశాలను కేంద్ర శాస్త్ర, సాంకేతికత, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిరంతర సమన్వయంతో అభివృద్ధిని వేగవంతం చేస్తున్న 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ప్రభావానికి' ఇది స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి శ్రీమతి అనితా వంగలపూడి, పార్లమెంట్ సభ్యులు శ్రీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే శ్రీ జి. శ్రీనివాసరావు, సీఎస్ఐఆర్-ఎన్ఐవో డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ సింగ్, డాక్టర్ వి.వి.ఎస్.ఎస్. శర్మ, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వి సమక్షంలో సభను ఉద్దేశించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ఈ ప్రాజెక్టుకు సంవత్సరాల కిందటే పునాది వేసినప్పటికీ ఇది ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంపూర్ణ సమన్వయంతో గడిచిన 8-10 నెలల్లోనే గణనీయమైన పురోగతితో ఈ ప్రాజెక్ట పూర్తయిందని తెలిపారు.

ఈ ప్రాజెక్ట కోసం రాష్ట్ర ప్రభుత్వం 2000వ దశకం ప్రారంభంలో నామమాత్రపు ధరకు భూమిని బదిలీ చేసిందని, అయితే ఆ ప్రాంతంలో వేగవంతమైన అభివృద్ధి కారణంగా దాని ప్రస్తుత విలువ అనేక రెట్లు పెరిగిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. సీఎస్ఐఆర్ తరపున, సీఎస్ఐఆర్ అధ్యక్షులు అయిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరపున భారత ప్రభుత్వం రూ. 32 కోట్లతో ఈ తీరప్రాంత ఆధారిత ప్రాంతీయ కేంద్రాన్ని జాతికి అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఈ కేంద్రం వ్యూహాత్మక ప్రాముఖ్యతను డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రధానంగా ప్రస్తావించారు. భారత్ దాదాపు 11,000-12,000 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కలిగి ఉందనీ, ఇందులో 1,000 కిలోమీటర్లకు పైగా ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతమేనన్నారు. ఇది నౌకా వాణిజ్య ఆర్థిక వ్యవస్థకు, ప్రధాన మంత్రి బ్లూ ఎకానమీ దార్శనికతకూ సహజ కేంద్రంగా మారుతుందన్నారు. భారత తూర్పు తీర సరిహద్దు భౌగోళికంగా వైవిధ్యభరితంగా ఉందనీ... హైడ్రోకార్బన్లు, సముద్రగర్భ ఖనిజాలు, చమురు, సహజ వాయువు నిక్షేపాల గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం హిమాలయ నదీ వ్యవస్థల నుంచి వచ్చిన భారీ అవక్షేపాలేనని ఆయన పేర్కొన్నారు.

విశాఖపట్నం తీరం అనేక రకాల సముద్ర వనరులకు కేంద్రంగా ఉందనీ... ఇది భారత ఇంధన భద్రతకు, బ్లూ ఎకానమీకి గణనీయంగా దోహదపడుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. కొత్తగా ప్రారంభించిన సీఎస్ఐఆర్-ఎన్ఐఓ ప్రాంతీయ కేంద్రం ఈ ప్రయత్నానికి శాస్త్రీయంగా కీలక ఆధారంగా పనిచేస్తుందని ఆయన అన్నారు.

సీఎస్ఐఆర్-ఎన్ఐవో ఇప్పటికే ఓఎన్జీసీ, ఆయిల్ ఇండియా, ఇతర సంబంధిత సంస్థల సన్నిహిత సహకారంతో పనిచేస్తోందన్నారు. ఫార్మాస్యూటికల్స్, ఓడరేవులు, థర్మల్ పవర్ ప్రాజెక్టులు, మత్స్య సంపద వంటి రంగాలకు ఇది చురుగ్గా మద్దతునిస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రధానంగా ప్రస్తావించారు. సముద్ర జీవ వనరులను వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఎక్కువగా ఉపయోగిస్తున్నందున సంభావ్య ఫిషింగ్ జోన్లను గుర్తించడం, మత్స్యకారుల కోసం సముద్రపు నాచు పెంపకం, హానికరమైన ఆల్గల్ బ్లూమ్లను అంచనా వేయడం కోసం కేంద్రం చేస్తున్న కృషి జీవనోపాధికి, ప్రజారోగ్యానికి ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర మంత్రి వివరించారు.

ప్రభుత్వ సమగ్ర విధానాన్ని స్పష్టం చేస్తూ... భారత నౌకా వాణిజ్య అభివృద్ధి ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాలు, పరిశోధనా సంస్థలు, అంకుర సంస్థలను ఏకతాటిపైకి తీసుకువస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. నౌకా వాణిజ్యం, తీరప్రాంత రంగాల అంకురసంస్థలు, ఆవిష్కర్తల కోసం సాంకేతికత, ఆర్థిక సహాయంతో కూడిన పటిష్ఠ వ్యవస్థ ఇప్పటికే అందుబాటులో ఉందని ఆయన పేర్కొన్నారు. దీనిలో క్రియాశీల భాగస్వాములు కావాలని ఆయన పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు.

విశాఖపట్నం కేంద్రం విస్తరిస్తున్న భారత భారత నౌకా వాణిజ్య రంగం కోసం యువ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అంకురసంస్థలు, భవిష్యత్ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ... సామర్థ్యాలను పెంపొందించడం, నైపుణ్య శిక్షణ కోసం ఒక ప్రధాన కేంద్రంగా ఆవిర్భవిస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు కృషిని ప్రత్యేకంగా ప్రశంసించిన కేంద్ర మంత్రి... ఆయన వ్యక్తిగత జోక్యం కారణంగా దాదాపు దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న తీరప్రాంత, పర్యావరణ అనుమతులు ఆరు నెలల్లోనే మంజూరయ్యాయన్నారు. దీనివల్ల ప్రాజెక్ట అమలులో ఒక్క రోజు కూడా ఆలస్యం జరగలేదని పేర్కొన్నారు. ప్రాజెక్ట తీరప్రాంతంలో ఉన్నందున దానికి అనేక అనుమతులు అవసర మయ్యాయనీ, కేంద్ర-రాష్ట్రాల మధ్య సమర్థ సమన్వయం ద్వారా వాటన్నింటినీ వేగంగా సాధించామని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు రాష్ట్ర నూతన రాజధాని అమరావతిపైనా ప్రధానమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. త్వరలోనే అక్కడ క్వాంటం టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గత 7-8 నెలల్లో విశాఖపట్నంలో తాను పర్యటించడం ఇది మూడోసారి అని... ఇది విజ్ఞానశాస్త్ర ఆధారిత అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ క్రియాశీల భాగస్వామ్యానికి ప్రతిబిం బిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

రుషికొండలోని యెండడ గ్రామంలో 4 ఎకరాల క్యాంపస్ను 3.25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు (జీ+1)తో 4,550 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ తీరప్రాంత ఆధారిత ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టును సీపీడబ్ల్యూడీ సంస్థ చేపట్టింది. దీని నిర్మాణం 2024, నవంబరు నెలలో ప్రారంభమై, 2025, డిసెంబరులో పూర్తయింది.

# ప్రియుడి భార్యను పెట్రోల్ పోసి హతమార్చిన ఘటనలో బాబూ మృతి

నాంపల్లి, జనవరి 31 : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కేతేపల్లిలో శనివారం దారుణ సంఘటన జరిగిన విషయం తెలిసిందే. ప్రియుడి భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటి ంచిన ఘటనలో ప్రియుడి బాబు (6 నెలలు) సైతం మృతిచె ందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి గ్రామానికి చెందిన నగేశ్ యాదవ్, మమత (25) ఇరువురు దంపతులు. వీరికి ఆరు నెలల వయస్సు ఉన్న బాబు ఉన్నాడు. అయితే నగేశ్ యాదవ్కు, అదే గ్రామానికి చెందిన సుజాతకు మధ్య వివాహేతర సంబంధం ఉంది. సుజాతకు పెండ్లి అయి భర్త గతంలోనే చనిపోయాడు. ఈమె కు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ క్రమంలో తన ఇద్దరు కూతుర్లలో ఒకరిని పెండ్లి చేసుకో వాల్సిం దిగా నగేశ్పై ఒత్తిడి చేస్తూ వస్తున్నట్లుగా సమాచారం. సుజాత ప్రతిపాదనను నగేష్ తిరస్కరించడంతో పగ పెంచుకుంది.

భార్యాబిడ్డా ఉండడంతోనే అతడు తిరస్కరిస్తున్నట్లుగా భావించిన సుజాత వారి అడ్డు తొలగించాలనే ఉద్దేశ్యంతో శనివారం నగేశ్ ఇంటికి వెళ్లి మరీ ఈ దారుణానికి పాల్పడింది. తన చిన్నారి బాబుకు పాలు ఇస్తున్న మమతపై సుజాత తన వెంట సంచిలో తెచ్చుకున్న పెట్రోల్, కారం, కత్తిలో పెట్రోల్ను తీసి ఒక్కసారిగా వారిమీద పోసి నిప్పంటించింది. దీంతో మంటలకు తాళలేక మమత తన ఒడిలోని చంటిబిడ్డను రక్షించుకునేందుకు ఒక్కసారిగా కిందకు విసిరేసి మంటల్లో సజీవ దహనమైంది. తీవ్ర గాయాలైన బాబును చికిత్స కోసం హుటాహుటిన హైదరాబాద్ నిలోఫర్కు తరలించగా పరిస్థితి విషమించడంతో బా బు సైతం మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటనతో ఊరిలో అంతటా విచారం నెలకొంది.

# ఎన్నికల రిటర్నింగ్ అధికారికి బీజేపీ అభ్యర్థి ఫిర్యాదు




మక్తల్, జనవరి 31: గ్రామపంచాయతీ ఎన్నికల్లో పంచదేవ్ పహాడ్ గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకుని తిరిగి మక్తల్ మున్సిపాలిటీలో 8వ వార్డులో ఓటు హక్కు కలిగి ఉండి ఒకటవ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి రాజ్యాంగాన్ని ఓటు హక్కును దుర్వినియోగపరుస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ లో తిరస్కరించాలని బిజెపి అభ్యర్థి బి. రాజశేఖర్ రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.

మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డ్ కు కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా మక్తల్ మండలంలోని పంచదేవపాడు గ్రామంలో 4వ వార్డ్ నందు పోలింగ్ స్టేషన్ నంబర్ 4లో పీఎస్ రూం నెంబర్ 2 లో ప్రాథమిక పాఠశాల యందు ఎన్ నెం. 139 (SJW2241859) గత గ్రామపంచాయతీ ఎన్నికల లో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అదేవిధంగా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్ నంబర్ 18 వార్డ్ నెంబర్ 8లో ఎస్ నెం. 497 లో ఓటు హక్కు కలిగియుండి 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

రాజ్యాంగం ఇచ్చినటువంటి ఓటు హక్కును దుర్వినియోగ పరుస్తున్న 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ను తిరస్కరించాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. సమాజంలో ఒక బాధ్యత కలిగిన వ్యక్తి రాజ్యాంగం ఇచ్చినటువంటి హక్కును ఈ విధంగా దుర్వినియోగంచేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కట్టా సురేష్ గుప్తా నామినేషన్ను తిరస్కరించాలని, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన రిటర్నింగ్ అధికారికి ఇచ్చిన ఫిర్యదులో డిమాండ్ చేశారు.

# దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి : లింగాల కృష్ణ మాదిగ

మెదక్, జనవరి 31: తొగుట మండలంలోని తుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్లో ఫిబ్రవరి 9న జరగబోయే ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.

గత మూడు దశాబ్దాలుగా దళితుల అభివృద్ధి, మాదిగల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆదేశాల మేరకు తొగుట మండల కేంద్రంలో మండల నూతన అధ్యక్షుడిగా ఆకారం కిషన్ మాదిగను నియమించారు.

ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. సామాజికంగా వెలివేయబడిన దళితుల అభివృద్ధికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్కు 10,000 కోట్ల ం ా ఎా య ి ం ల ం కేటాయించాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించాలి. అంతేకాకుండా దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా సదస్సు విజయవంతం కావాలంటే ప్రతి గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిని రాజమలయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి బొంబాయి వెంకట్, రాష్ట్ర, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలిగరి కృష్ణ, జిల్లా కార్యదర్శి కాసర్ల నర్సింలు, జిల్లా అధికార ప్రతినిధి లింగాల స్వామి, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ లింగాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'వందేమాతరం: భారతీయ శాశ్వత ప్రతిధ్వని" సాంస్కృతిక నృత్య ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి






న్యూఢిల్లీ, జనవరి 31:గణతంత్ర దినోత్సవ కవాతు 2026లో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ రెండు అవార్డులను దక్కించుకుంది. కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల విభాగంలో "వందేమాతరం-150 ఏళ్ల ప్రయాణం" శీర్షికతో ప్రదర్శించిన శకటం ప్రథమ బహుమతిని గెలుచుకుంది. "వందేమాతరం: భారతీయ శాశ్వత ప్రతిధ్వని నాదం" అనే పేరుతో అందించిన అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనకు, దాని విశిష్ట కళాత్మకత, నేపథ్య ప్రతిభకు గానూ ప్రత్యేక బహుమతి లభించింది.

అవార్డు గెలుచుకున్న వందే మాతరం శకటం వందే మాతరం గీతం 150 సంవత్సరాల ప్రయాణాన్ని శక్తిమంతంగా ఆవిష్కరించింది. జాతీయ చైతన్యాన్ని మేల్కొలిపిన గీతంగా... ఆవిర్భావం నుంచి భారత స్వాతంత్ర్య ఉద్యమం, జాతీయ ఐక్యత, నాగరికతా స్పృహను పెంపొందించడం వరకూ పోషించిన శాశ్వత పాత్రను ఈ శకటం కళ్లకు కట్టినట్లు చూపించింది. ఉద్వేగ భరిత దృశ్యాలు, ప్రతీకల ద్వారా ఈ శకటం దేశ సామూహిక జాతీయ గుర్తింపులో వందే మాతారానికి ఉన్న శాశ్వత ప్రాముఖ్యతను చాటిచెప్పింది.

ప్రత్యేక బహుమతి గెలుచుకున్న "వందేమాతరం-భారత శాశ్వత ప్రతిధ్వని" సాంస్కృతిక నృత్య ప్రదర్శనను పాటియాలాలోని ఉత్తర ప్రాంత సాంస్కృతిక కేంద్రం సహకారంతో సంగీత నాటక అకాడమీ రూపొందించింది. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి గొంతుకగా నిలిచిన కవి బంకిం చంద్ర ఛటర్జీ రచనకు ఈ ప్రదర్శన నివాళి అర్పించింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 2,500 మంది కళాకారులు పాల్గొని.. శాస్త్రీయ, జానపద, గిరిజన కళారూపాల ద్వారా సుసంపన్నమైన దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

ఈ నృత్య రూపకల్పన భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక మూలాల నుంచి ప్రారంభమై, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, సాయుధ దళాల శౌర్యం, అంకితభావం వరకు విస్త రించిన ప్రయాణాన్ని ఆవిష్కరి ంచింది. సంస్కృత మంత్రాలు, భావోద్వేగాలను రేకెత్తించే సంగీతం, చురుకైన విన్యాసాలతో కూడిన ఈ ప్రదర్శన.. వందే మాతరం గీతానికి సంబంధించిన సంపూర్ణ భావోద్వేగ, తాత్విక ప్రయాణాన్ని సజీవంగా ప్రతిబిం బించింది. చివరిగా ఐక్యత, భక్తి, జాతీయ గర్వానికి ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకానికి శక్తమంతమైన నివాళి ఇవ్వడంతో ఈ ప్రదర్శన ముగిసింది.

ఈ సాంస్కృతిక ప్రదర్శనకు సంగీత నాటక్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ సంధ్యా పురేచా సృజనాత్మక దర్శకురాలిగా నాయకత్వం వహించగా, ఆస్కార్ అవార్డు గ్రహీత శ్రీ ఎంఎం కీరవాణి సంగీత దర్శకత్వం వహించారు. అదనపు సాహిత్యాన్ని శ్రీ సుభాష్ సెహగల్ అందించారు. జాతీయ అవార్డు విజేత, నటుడు శ్రీ అనుపమ్ ఖేర్ వాఖ్యాతగా వ్యవహరించారు. అలాగే శ్రీ సంతోష్ నాయర్ నృత్య రూపకల్పన చేయగా, శ్రీమతి సంధ్యా రామన్ కాస్ట్యూమ్ డిజైనర్ గా పనిచేశారు.

# ఘనంగా వీడ్కోలు..



విజయవాడ, జనవరి 31: ఎన్.టి.ఆర్ జిల్లా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆరుగురు పోలీస్ అధికారులకు శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆత్మీయంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత ఇతర ఉన్నతాధికారులతో కలిసి పదవీ విరమణ చేసిన అధికారులను పోలీస్ మర్యాదలతో శాలువాలు కప్పి సత్కరించారు.

ఈ సందర్భంగా డీసీపీ సరిత మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం చట్టాలకు అనుగుణంగా ప్రజాసేవకు తమ సమయం, శక్తిని అంకితం చేసి విశిష్ట సేవల ందించినందుకు అభినందించారు. పోలీస్ శాఖలో అందరూ ఒకే కుటుంబ సభ్యులమని, విధి నిర్వహణలో చూపిన చిత్తశుద్ధి, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యత లతో ఇప్పటివరకు 24 గంటలూ బిజీగా గడిపిన వారికి పదవీ విరమణ అనంతరం ఒక్కసారిగా ఖాళీ సమయం రావడం కష్టంగా అనిపిస్తుందని, అందువల్ల ఆధ్యాత్మికత వైపు మళ్లడమో లేదా ఏదైనా మంచి వ్యాపకం అలవా టు చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన అధికారుల కుటుంబ సభ్యులను కూడా ఆమె ఆత్మీయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ తరఫున వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పదవీ విరమణ పొందిన వారు: భవానీపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ పి.ఎస్. ప్రకాష్ రావు, నాల్గవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. నాగ సుబ్బారావు, కొత్తపేట పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస బాబ్జి, మహిళా హోం గార్డులు ఎం.వి.ఎన్. కుమారి, వి. చిన్ని, కె. శేషు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సునీత, ఏఆర్ఎ అదనపు డీసీపీ కె. కోటేశ్వరరావు, ఏఆర్ఎ ఏసీపీ ప్రేమ్ కుమార్, ఆర్ఐలు శ్రీనివాసరావు, సురేష్ రెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎం. సోమ య్య, అసోసియేషన్ సభ్యులు, సీపీఓ సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొ న్నారు.

# కేంద్ర బడ్జెట్ 2026-27 అనంతరం దేశంలోని యువతతో సంభాషించనున్న కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 31:కేంద్ర బడ్జెట్ 2026?27ను ప్రవేశపెట్టిన అనంతరం కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది కళాశాల విద్యార్థులతో ముఖాముఖి సంభాషిస్తారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు లోక్సభ గ్యాలరీ నుంచి కేంద్ర బడ్జెట్ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని పొందుతారు. దీనివల్ల సంవత్సరంలో అత్యంత కీలకమైన పార్లమెంటు కార్యకలాపాల్లో ఒకదానిని ప్రత్యక్షంగా చూసే అరుదైన అవకాశం లభిస్తుంది.

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులు.. వాణిజ్యం, ఆర్థిక శాస్త్రం, వైద్య విద్య, వృత్తిపర కోర్సులు వంటి వివిధ విభాగాలకు చెందిన వారు.

కర్తవ్య భవన్-1లో ఉన్న ఆర్థిక మంత్రిత్వ శాఖను కూడా విద్యార్థులు సందర్శిస్తారు. అక్కడ వివిధ స్థాయిల్లోని సీనియర్ అధికారులతో ముఖాముఖి సంభాషించి, మంత్రిత్వ శాఖ పనితీరు, విధాన రూపకల్పన ప్రక్రియలు, దేశ నిర్మాణంలో సంస్థల పాత్ర గురించి అవగాహన పొందుతారు.

అనంతరం సాయంత్రం వేళ శ్రీమతి నిర్మలా సీతారామన్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. బడ్జెట్ ప్రాధాన్యతలు, భారత భవిష్యత్తు కోసం బడ్జెట్ దార్శనికత,యువతపై దాని ప్రభావం వంటి అంశాలపై వారితో స్వేచ్ఛయుత చర్చలో పాల్గొంచారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూడా తమ ఆలోచనలు, దృక్పథాలు, ఆకాంక్షలను పంచుకుంటారు. యువతకు, దేశ ప్రగతికి సంబంధించి తమ అభిప్రాయాలను తెలియజేస్తారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక శాస్త్రం, పరిపాలన, ప్రజాస్వామ్య ప్రక్రియలపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశం.

దేశ ఆర్థిక, పార్లమెంటరీ విధానాల్లో యువతకు సరైన సమాచారంతో కూడిన సానుకూల భాగస్వామ్యాన్ని ఇది ప్రోత్సహిస్తుంది.

బడ్జెట్ రూపకల్పన సమయంలో వివిధ వేదికల ద్వారా యువతతో సహా పౌరలందరి నుంచి అనేక సూచనలు, అభిప్రాయాలను సేకరించారు. అవన్నీ రాబోయే కేంద్ర బడ్జెట్ 2026-27లో ప్రతిబింబిస్తాయి.

# జిల్లాలో గంజాయి కలకలం

**-గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల దాడి**
**-6 కిలోల గంజాయి స్వాధీనం**



నంద్యాల బ్యూరో, జనవరి 31:నంద్యాల జిల్లాలో రోజు రోజుకు గంజాయి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని సిరివెళ్లలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వారిపై నిఘా పెట్టిన పోలీసులు శనివారం దాడి చేశారు. వారి నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదు మంది ని అరెస్ట్ చేశారు.ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ తెలిపిన వివరాలమేరకు జిల్లాఎస్ పి సునీల్ షెరాన్, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడ గంజాయి, అమ్మేవారు కొనేవారు అసాంఘిక శక్తులు రౌడీ మూకలు పై జిల్లావ్యాప్తంగా డేగ కన్నులు పెట్టమని ఆదేశించారు.

ఈ మేరకు శిరివెళ్ల సర్కిల్ సీఐ రాము ఆధ్వర్యంలో, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబ డిందన్నారు.ఈ క్రమంలో, శిరివెళ్ల పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఐ జయప్ప కు అందిన ముందస్తు సమాచారం ప్రకారం ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.శిరివెళ్ల మండలం బోయిలకుంట్ల గ్రామానికి చెందిన జింకల మద్దిలేటి ఏ 1వద్దకు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోడూరు శ్రీనివాసు ఏ 2 గంజాయి తీసుకొని బోయిల కుంట్ల గ్రామ సమీపంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్దకు వస్తాడని తెలిసింది. శిరివెళ్ల పోలీస్ స్టేషన్ ఎస్ ఐ సిబ్బంది కలిసి బోయిలకుంట్ల గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్దకు వెళ్లారు. అక్కడ ఐదుగురు వ్యక్తులు గంజాయిని ప్యాక్ చేసి అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా మాట్లాడుకుంటూ ఉండగా, వారిని పట్టుకొని తనిఖీ చేశారు.

జింకల మద్దిలేటి ఏ1 వద్ద నుండి 2 కిలోల గంజాయిని,కోడూరు శ్రీనివాసు ఏ 2 వద్ద నుండి 1 కిలో గంజాయిని, దండబోయిన గురుస్వామి ఏ 3 వద్ద నుండి 1 కిలో గంజాయిని,షేక్ అబ్దుల్ నబీ ఏ 4 వద్ద నుండి 1 కిలో గంజాయి ని,మొఘల్ గఫార్ భేగ్ ఏ 5 వద్ద నుండి 1 కిలో గంజాయి మొత్తం కలిపి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేశామని తెలిపారు.విచారణలో ఏ 1 జింకల మద్దిలేటి పై ఇప్పటికే కృష్ణా జిల్లా అవనిగడ్డ పి.ఎస్., ఢిల్లీ, నంద్యాల జిల్లా మహానంది పి.ఎస్., నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ లో కలిపి మొత్తం 4 గంజాయి కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.

ఇతనిపై రోడీ షీట్ మరియు సస్పెక్ట్ షీట్ కూడా ఉందన్నారు. గతంలో ఇతడు ఒరిస్సా నుండి గంజాయి తెచ్చేవాడన్నారు. ఆ క్రమంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోడూరు శ్రీనివాసు పరిచయం అయ్యాడు. ప్రస్తుతం అదే పరిచయంతో, కోడూరు శ్రీనివాసు ద్వారా ఒరిస్సా నుండి గంజాయి సరఫరా చేసుకుంటున్నట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా కు పాల్పడిన వారిపై , రౌడీ షీటర్లు మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకొని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# హిందాల్కో బహుళ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

**-కాడా భాగస్వామ్యంతో యువతకు నైపుణ్య శిక్షణ**
**-కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు నాయుడు**
**-ఏటా 500 మందికి పైగా యువతకు ప్లేస్‌మెంట్ శిక్షణ**
**-పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన కోర్సులు**
**-ఏఐ ఆధారిత డిజిటల్ లెర్నింగ్ ప్రత్యేకత**
**-స్థానిక భాషల్లో శిక్షణ అందించే విధానం**
**-స్వర్ణ కుప్పం విజన్ 2029కు తోడ్పాటు**
**-ఉపాధి అవకాశాలు, సమ్మిళిత వృద్ధిపై హిందాల్కో దృష్టి**



అమరావతి, జనవరి 31:యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు అవసరమైన బహుళ నైపుణ్యాలను అందించేందుకు కాడా ( కేఏడీఏ) భాగస్వామ్యంతో కుప్పంలో శిక్షణా కేంద్రంను ఏర్పాటుచేసిన హిందాల్కో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ కేంద్రంను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం 500 మందికి పైగా యువతకు ప్లేస్‌మెంట్-అనుసంధానిత, పరిశ్రమ-సంబంధిత శిక్షణను అందించడానికి ఈ అత్యాధునిక కేంద్రం తోడ్పడనుంది. యువతకు ఉపాధి అవకాశాలను, సమ్మిళిత వృద్ధిని పెంపొందించడానికి హిందాల్కో దేశవ్యాప్తంగా చేపట్టిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఇది ఒక భాగం. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) సహకారంతో, ఆంధ్రప్రదేశ్‌లోని తమ కుప్పం ప్లాంట్‌లో అత్యాధునిక బహుళ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ నేడు వెల్లడించింది. యువతకు సాధికారత, సమ్మిళిత వృద్ధి , శ్రామిక శక్తి అభివృద్ధి పట్ల సంస్థ నిబద్ధతను ఇది పునరుద్ఘాటిస్తుంది.

ఈ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌరవనీయులైన శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు, సీనియర్ హిందాల్కో నాయకత్వం చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ శ్రీ సమిక్ బసు, డౌన్‌స్ట్రీమ్ హెడ్ శ్రీమతి కోపల్ అగర్వాల్ మరియు ఇతర ప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు. జాతీయ మరియు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా, ప్లేస్‌మెం ట్-అనుసంధానిత , ఇండస్ట్రీ-అనుగుణమైన ప్రోగ్రామ్‌ల ద్వారా ఏటా 500 మందికి పైగా యువతకు శిక్షణ ఇవ్వడం మరియు నైపుణ్యాన్ని పెంచడం కుప్పం మల్టీ-స్కిల్స్ ట్రైనింగ్ సెంటర్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం ప్రాంతీయ పరివర్తనను వేగవంతం చేయడానికి మరియు స్వర్ణ కుప్పం విజన్ 2029 లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి రూపొందించబడిన విస్తృత స్థాయి పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని సూచిస్తుంది.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ శ్రీ సామిక్ బసు మాట్లాడుతూ "హిందాల్కో వద్ద మేము సామాజిక , ఆర్థిక పరివర్తనకు నైపుణ్యాన్ని శక్తివంతమైన ఉత్ప్రేరకంగా చూస్తుంటాము. ఈ కేంద్రం ప్రపంచ స్థాయి వృత్తి శిక్షణను యువతకు వారి స్వంత భాషలో అందుబాటులోకి తీసుకురావడానికి యుఎస్ఏ లోని ఇనీని ఖీవజీశ్రీతిబిఎతో భాగస్వామ్యం చేసుకుంది. తద్వారా లీనమయ్యే, ఏఐ -ఆధారిత అభ్యాసాన్ని ఉపయోగించుకునే అవకాశం అందిస్తుంది. పరిశ్రమ-సంబంధిత, ప్లేస్‌మెంట్-కేంద్రీకృత కార్యక్రమాలతో అధునాతన సాంకేతికతను అనుసంధానించడం ద్వారా, మేము ఉపాధికి స్థిరమైన మార్గాలను సృష్టిస్తున్నాము. ఈ ప్రాంతానికి భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సిద్ధం చేస్తున్నాము "అని అన్నారు.

దాదాపు 22,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ ప్రత్యేక కేంద్రంలో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డొమైన్-నిర్దిష్ట ప్రాక్టికల్ ల్యాబ్‌లు, డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్‌లు మరియు కెరీర్ గైడెన్స్ మౌలిక సదుపాయాలు ఉన్నాయి, ఇవి పరిశ్రమ-సంబంధిత, ఫలితాల-ఆధారిత నైపుణ్యాలను అందించడానికి రూపొందించబడ్డాయి. రాబోయే మూడు సంవత్సరాలలో, ఈ కేంద్రం 875 మందికి పైగా యువతకు శిక్షణ ఇచ్చి, 600 మంది వరకు ఉద్యోగ నియామకాలకు వీలు కల్పిస్తుందని, పరోక్షంగా 5,000 మందికి పైగా కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరుస్తుందని మరియు అవగాహన మరియు నైపుణ్య కార్యక్రమాల ద్వారా 20,000 మంది కమ్యూనిటీ సభ్యులను నిమగ్నం చేస్తుందని భావిస్తున్నారు.ఈ కేంద్రం యొక్క ప్రత్యేకత ఏమిటంటే, దాని ఏఐ ఆధారిత డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్.

# పుడమి తల్లికి హారం వృక్ష సంపద.



సంగారెడ్డి, జనవరి 31 (నేటి నిజం ప్రతినిధి)తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మదర్ ట్రీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు.

వృక్ష సంపద పుడమి తల్లి రక్షణ వంటిదని, వృక్షాలను కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మన అందరిని వృక్షాలు మానవ జీవన విధానంలో ఒక భాగమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి వృక్షాలను కాపాడుతామని జీవరాశి మొనగాడు లో భాగస్వాముల మోగుతామని వాతావరణ కాలుష్యాన్ని తొలగించడానికి తమ వంతు కృషి చేస్తామని వృక్షా జంతువు జీవజాల మనుగడను కాపాడుతామని పుడమి తల్లి అభివృద్ధిలో భాగస్వాముల మవుతామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

వృక్షాలు కూడమి తల్లికి హారము వంటివని ప్రకృతి పరిశుద్ధంగా ఉంటుందని ప్రకృతి అందాలు జంతు జీవరాశి కి ప్రశాంతతను కలిగిస్తాయని తెలిపినారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్, ఏకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ సోఫియా రాణి, ఎన్ఎస్ఎస్ అధికారులు, ఎన్సిసి అధికారి, కళాశాల వివిధ విభాగ దిపతులు, అధ్యాపక బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.

## చారిత్రాత్మక భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఓ వ్యాసాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 31: భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే దార్శనికతకు అనుగుణంగా ఉన్న చారిత్రాత్మక భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కేంద్రమంత్రి శ్రీ పీయూష్ గోయల్ రాసిన వ్యాసాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు పంచుకున్నారు. "మార్కెట్లను విస్తరిస్తూ, ఉద్యోగాలను సృష్టిస్తూ, దేశ ప్రధాన ప్రయోజనాలను కాపాడే ఒక విప్లవాత్మక ఒప్పందాన్ని ప్రభుత్వం అమలు చేసిన తీరును కేంద్రమంత్రి ఈ వ్యాసంలో గొప్పగా వివరించారు" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ లో కేంద్రమంత్రి శ్రీ పీయూష్ గోయల్ చేసిన పోస్ట్‌పై స్పందిస్తూ ప్రధానమంత్రి ఇలా అన్నారు.

"కేంద్రమంత్రి శ్రీ పీయూష్ గోయల్ రాసిన ఈ కథనం ప్రతి ఒక్కరూ చదవాల్సిందే. భారత్-ఈయూ మధ్య కుదిరిన చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం.. భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే మన దార్శనికతకు పూర్తి అనుగుణంగా ఉన్న విధానాన్ని ఆయన ఈ వ్యాసంలో వివరించారు. మార్కెట్లను విస్తరించడం, ఉద్యోగ అవకాశాలను సృష్టించడం, భారతదేశ ప్రధాన ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం ఒక విప్లవాత్మక ఒప్పందాన్ని అందించిన తీరును ఈ కథనంలో ప్రస్తావించారు".

## టీఎంసీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత అవినీతిమయం.. మమత ప్రభుత్వంపై అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ, జనవరి 31:పశ్చిమ బెంగాల్‌లోని, మమతా బెనర్జీ ఆధ్వర్యంలో నడుస్తున్న టీఎంసీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం మమతా బెనర్జీదే అని వ్యాఖ్యానించారు.

ప.బెం గాల్, సిలిగురిలో శనివా రం జరిగిన బీజేపీ కార్యకర్తల సమా వేశంలో అమిత్ షా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ పాలనను తీవ్రంగా తప్పుబట్టారు.

"భారత సరిహద్దు (పశ్చిమ బెంగాల్) ప్రాంతంలో కంచె ఏర్పాటు చేసేందుకు బీఎస్ఎఫ్‌కు భూమి అవసరం. సరిహద్దులో కంచె ఏర్పాటు చేసేందుకు స్థలం కావాలని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కోరాం.

ఈ అంశంపై ఇప్పటికే మమతకు ఏడుసార్లు లేఖలు రాశాం. చివరకు నేనే నేరుగా మమత కార్యాలయానికి వెళ్లి మరీ భూమి గురించి అడిగా. కానీ, ఇంతవరకు భూమి కేటాయించలేదు. బెంగాల్‌లోని ప్రతి వర్గం ఒకరితో ఒకరు గొడవ పడేలా చేసి, ఐకమత్యాన్ని దెబ్బతీయడంలో మమత సిద్ధహస్తురాలు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం మమతా బెనర్జీది. ఇంత అవినీతికి పాల్పడే ప్రభుత్వం మరొకటి లేదు. ఆనందపూర్ వేర్ హౌజ్‌లోని మోమో ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారికి నా నివాళులు. ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదు. మమతా బెనర్జీ అవినీతి వల్ల జరిగిన ఘటన.

ఈ ఫ్యాక్టరీలో ఎవరి డబ్బు ఉంది.. ఫ్యాక్టరీ ఓనర్ విదేశాలకు ఎలా వెళ్లారు.. ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదు.. ప్రమాదం జరిగిన 32 గంటల తర్వాతగానీ మంత్రి అక్కడకు చేరుకోలేదు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మమత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా' అని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాగా.. ఈ ఘటనలో 21 మంది కూలీలు మరణించారు.

# కొలనూరులో సమ్మక్క జాతరలో ఉప్పొంగిన భక్తి పరవశం



కరీంనగర్, జనవరి 31:పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్ సమ్మక్క సారలమ్మ జాతరలో శనివారం సాయంత్రం అమ్మవార్ల వన ప్రవేశం సందర్భంగా భక్తుల్లో భక్తి పారవశ్యం ఉప్పొంగింది. శనివారం సాయంత్రం వేళ సమ్మక్క సారలమ్మ లను తిరిగి వన ప్రవేశం చేయించే క్రమంలో కోయ పూజారులు వెళుతుండగా భక్తులు నేలపై పడుకోవడంతో వారి పైనుంచి వనదేవతలను తీసుకువెళ్లారు.

జాతరలో దారి పొడవునా భక్తులు కోయ పూజారులు పూనకంతో వస్తుండగా నేలపై ఒకరిపై ఒకరు పడుకోవడం ఆకర్షించింది. అమ్మవార్లు తమను చల్లగా చూడాలని భక్తి భావంతో ఇలా నేలపై పడుకున్నారు.

# సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి

**-జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.**



సంగారెడ్డి, జనవరి 31 (నేటి నిజం ప్రతినిధి) ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్‌వోలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి, ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి, క్షేత్రస్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేశామని చెప్పారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నారంటూ...

# 1న రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్ జనవరి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సిట్ విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా కేసీఆర్‌ను వేధిస్తున్నారంటూ రేపు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నిరసన ప్రదర్శనలు చేయనున్నారు. రేపు రాష్ట్రమంతటా శాంతియుతంగా ఆందోళనలకు దిగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 12 వేలకు పైగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని సూచించారు.నిరసనల్లో భాగంగా ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీలు నిర్వహించనున్నాయి. నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. ధర్నాలు, రాస్తారోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేయనున్నారు. మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేయాలని, పోలీసులతో ఘర్షణలు వద్దని సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

**-బీసీ సంక్షేమ సంఘం జాతీయస్ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్.**

హైద్రాబాద్ జనవరి 31(ఎక్స్ ప్రెస్ న్యూస్ )మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలనిబీసీ సంక్షేమ సంఘం జాతీయస్ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.శనివారం.బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యాలయం లోరాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ అధ్యక్షతన బీసీలకు42 శాతం రిజర్వేషన్ పైన సమావేశం జరిగింది.ఈ న్ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఉమ్మడిమెదక్ జిల్లాకు చెందిన మున్సిపాలిటీలలో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలకు వెళుతుంది. గత ఎన్నికలలో 34 శాతం మున్సిపాలిటీలలో అమలు చేశారు ఇప్పుడు దానిని 28% తగ్గించడం ఏమాత్రం సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వాలు కూడా రాష్ట్ర ఉద్దేశపూర్వకంగా తెలంగాణలోని వెనకబడు తరగతులను మభ్యపెడుతూ బీసీలను రాజకీయంగా అణచివేయాలని కుట్రతో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయకుండా తొక్కి పెడుతున్నారు ఒకవైపు కోర్టు కేసు నడుస్తుండగా తీర్పురాకుండానే ఎన్నికలు జరపడం న్యాయవిరుద్ధం రాజ్యాంగ విరుద్ధం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానం ప్రకారం బీసీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుచున్నాము. ఒకవైపు కోర్టు కేసులు మరియు బీసీలందరూ ధర్నాలురాస్తారోకోలు మరియు దీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీలు కార్పొరేషన్లు జరిగే ఎన్నికలలో బీసీలను అత్యధిక. మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు ప్రభు గౌడ్ గారు విజ్ఞప్తి చేశారు వచ్చేది బీసీల రాజ్యాధికారం అని రాజ్యసభ సభ్యుడు బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్ ఆర్.కృష్ణయ్య అన్నారు

# సాహితీ వట వృక్షం జువ్వాడి గౌతమరావు

**–ఫిబ్రవరి 1 జువ్వాడి గౌతమరావు జయంతి**



ఆయన ఒక సాహితీ వట వృక్షం. స్వయంగా కవి మాత్రమే కాకుండా, ఎందరో సాహితీ వేత్తలకు ఆశ్రయ దాత.

దివంగత ప్రధాని పీ.వి. నరసింహా రావు, కాళోజీ నారాయణరావు, కోవెల సుప్రసన్న, సంపత్ కుమార ఆచార్య, సామల సదాశివ లాంటి సాహితీ దురంధరులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నవారు. ప్రధానంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు గల అనుబంధం, విశ్వనాథను కరీంనగర్ రప్పించి, అక్కడి డిగ్రీ కళాశాల ప్రాచార్యునిగా విధులు నిర్వహించేలా చేసింది. తద్వారా ఉత్తర తెలంగాణకు చెందిన సాహితీవేత్తల సంగమానికి వేదికను ఏర్పరచి, సాహిత్య సుసంపన్నానికి కార్య క్షేత్రాన్ని సిద్ధం చేసింది. ఇలా కరీంనగర్ లో సాహితీ సౌరభాలు గుబాలించ డానికి అహరహం శ్రమించిన సాహితీ ప్రియుడు జువ్వాడి గౌతమరావు. గౌతమ రావు సాహితీ వేత్త నే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో యోధుడు. సోషలిస్టు భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఔరంగాబాద్ జైలు గోడలను ఛేదించుకొని వచ్చిన ధైర్యశాలి. పార్టీ పక్షాన 1977లో పోటీ చేసి ఓటమి చెందాడు.

జువ్వాడి గౌతమరావు (ఫిబ్రవరి 1, 1929 – 2012) కరీంనగర్ మండలం ఇరుకుళ్ళ గ్రామంలో 1929, ఫిబ్రవరి 1 న జువ్వాడి గౌతమరావు జన్మించాడు. కరీంనగర్‌లో విద్యాభ్యాసం సాగించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్ఎల్బీ పట్టా పుచ్చుకున్నాడు. పీవీ నరసింహారావు, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య వంటి సాహితీ మిత్రులతో ఆయనకు చాలా సాన్నిహిత్యం ఉన్నది. కరీంనగర్ సాహిత్య చైతన్య కేంద్రంగా భాసిల్లడంలో గౌతంరావు పాత్ర అసామాన్యం, అద్వితీయం. కరీంనగర్‌లో తెనుగు ఉనికిని కాపాడుతూ, అనేక కవితా గోష్ఠులలో పాల్గొంటూ నిరంతర సాహిత్య సేవ చేసిన భాషాభిమాని జువ్వాడి. ఆధునిక కాలంలో అడుగంటి పోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటు పడ్డాడు. వరంగల్‌లో కాళోజీ, ఆదిలాబాదులో సామల సదాశివ మాదిరిగా కరీంనగర్‌లో జువ్వాడి గౌతంరావు సాహితీ వటవృక్షంగా వేలాది మంది సాహితీ కారులకు ఆశ్రయమిచ్చాడు. ప్రగతి గామిగా ఉంటూనే విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి, విశ్వనాథకు భక్తుడిగా మారాడు. ప్రేమతో విశ్వనాథుని తన హృదయంలో దాచుకొన్నాడు.

కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు జువ్వాడి అత్యంత ఆత్మీయుడు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యమైన కంఠంతో తమదైన శైలిలో అంతరార్థాలను విశదీకరిస్తూ రసికులకు వినిపించ గలిగి, అయన మూర్తి తత్వాన్ని ఆవిష్కరించాడు. తానే రచించాడా అన్నంతగా ప్రజల్లోకి రామాయణ కల్పవృక్షాన్ని తీసుకెళ్లాడు. జువ్వాడి ప్రోద్బలంతోనే విశ్వనాథ సత్య నారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. విశ్వనాథ 'భక్తియోగ' అనే పద్యకావ్య సంపుటిని జువ్వాడి కోసం రాసి అంకితం ఇచ్చారు. 'కల్పవృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' వంటి జువ్వాడి సాహిత్య వ్యాసాలు సాహిత్యలోకంలో సంచలనాలు సృష్టించాయి.

నవ్య సాహిత్యోద్యమ కాలంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కొంతకాలం పాటు "జయంతి" అనే సాహిత్య పత్రిక నడిపాడు. తర్వాత దానికి జువ్వాడి సారథ్యం వహించాడు. వివిధ పత్రికల్లో జువ్వాడి రాసిన వ్యాసాలన్నింటినీ సంకలనం చేసి తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ వెలిచాల కొండలరావు 'సాహిత్య ధార' పేరుతో ఒక పుస్తకాన్ని ముద్రించాడు. జువ్వాడి సాహిత్య కృషికి గాని, సంపాదకత్వం వహించినప్పటి జయంతి పత్రికకు గాని రావాల్సిన కీర్తి ప్రతిష్ఠలు రాలేదు. అయినా జయంతి సంపాదకుడిగా ఆయన సంపాదకత్వం పత్రికా రంగానికే వన్నె తెచ్చింది. నాడు ఇంటర్ చివరి సంవత్సరం చదువుతున్న సి.నారాయణరెడ్డి తొలి కవిత అచ్చయింది ఆ పత్రికలోనే. జీవితమంతా సాహితీ అధ్యయనం తోను, విశ్వనాథ కల్పవృక్ష గానంతోను గడిపాడు. ఇటీవలే విశ్వనాథ ప్రత్యేక సంచికను సాహిత్యపీఠం ఆయనకు అంకితం చేసింది.



**–రామ కిష్టయ్య**
**సంగన భట్ల,**
9440595494

# పాకిస్తాన్ దివాళా అంచున ఉంది.. అప్పులిచ్చి ఆదుకోండి

**–పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్**

న్యూ డిల్లీ జనవరి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిచ్చగాళ్లు బిచ్చం కోసం ఇంటింటికీ తిరిగినట్లు తాము కూడా అప్పు కోసం ప్రపంచ దేశాలు తిరిగామని చెప్పుకొచ్చాడు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్. పాక్ ఆర్థిక పరిస్థితి ఎంత దిక్కుమాలిన స్థితిలో ఉందో నేరుగా ఇలా ఆ దేశ ప్రధానే చెప్పడం విశేషం. తాను, దేశ ఆర్మీ చీఫ్ అసిం మునీర్ కలిసి అప్పు కోసం ప్రపంచ దేశాలు తిరిగినట్లు చెప్పుకొచ్చాడు. పాకిస్తాన్‌లో జరిగిన ఒక సమావేశంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ విషయం వెల్లడించాడు.దాయాది దేశం పాకిస్తాన్ దివాళా అంచున ఉంది. అందుకే తమకు ప్రపంచ దేశాలు అప్పులిచ్చి ఆదుకోవాలంటూ అనేక దేశాలు తిరిగినట్లు షెహబాజ్ షరీఫ్ వెల్లడించాడు. తనతోపాటు పాక్ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిం మునీర్ కలిసి వివిధ దేశాలు తిరిగినట్లు చెప్పుకొచ్చాడు. అనేక దేశాలకు వెళ్లి తమకు ఆర్థిక సాయం చేయాల్సిందిగా సిగ్గు లేకుండా అడుక్కున్నామని, ఈ సమయంలో తామెంతో సిగ్గుపడ్డట్లు, అవమానాన్ని ఎదుర్కొన్నట్లు షరీఫ్ చెప్పాడు. "పాకిస్తాన్ విదేశీ రుణాల మీద ఆధారపడటం సిగ్గు చేటు. దీనివల్ల దేశం ఆర్థికంగా బలహీనంగా మారుతుంది. ఆత్మగౌరవం దెబ్బతింటుంది. మన అధికారులు.. ముఖ్యంగా ఆర్మీ చీఫ్ అసిం మునీర్ ఇబ్బంది ఎదుర్కొన్నాడు. నేను, అసిం కలిసి ప్రపంచ దేశాలు తిరిగి డబ్బు కోసం అడుక్కున్నాం. ఈ సమయంలో ఎంతో అవమానంగా ఫీలయ్యాం. తలవంచుకుని రుణాలు తీసుకున్నాం. ఈ సమయంలో వాళ్లు చెప్పిన అనేక పనులు చేసేందుకు ఒప్పుకోకతప్పలేదు.విదేశీ రుణాలు ఎక్కువగా తీసుకోవడం వల్లే ఐఎంఎఫ్ రుణాలివ్వడం లేదు. మన మిత్రదేశాలైన చైనా, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ దేశాలు ఎంతో సాయం చేశాయి. పాక్ ఆర్థిక సంక్షోభంలో అండగా నిలబడ్డాయి" అని షెహబాజ్ షరీఫ్ చెప్పుకొచ్చాడు. పాకిస్తాన్ ఆర్థిక పరిస్తితి అత్యంత దయనీయ స్థితిలో ఉందని చెప్పేందుకు ఆ దేశ ప్రధాని మాటలే సాక్ష్యం. విదేశీ రుణాలు ఇస్తే తప్ప ఆ దేశం ప్రస్తుతం నిలదొక్కుకునే పరిస్థితి లేదు.

# ఘనంగా జంటకవుల అష్టావధానం



హైద్రాబాద్ జనవరి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్)వాగ్దేవి సంస్కృత భారతి 25 వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం వార్షికోత్సవ వేడుకలను దీనదయాళ్ నగర్ విజయ వినాయక దేవాలయంలో వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపకులు అంబికానాథ్ శర్మ సంధ్య దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయంలో సరస్వతి దేవి అమ్మవారికి విశేష అభిషేకం ,సహస్రనామార్చనలు , అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంస్కృతాంధ్ర అష్టావధానం కార్యక్రమం నిర్వహించారు, అష్టావధానం ను జంట కవులైన డా ముదిగొండ అమర్నాథ్ శర్మ ముత్యంపేట గౌరీ శంకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు, పృచ్ఛకులుగా కవి రచయిత అక్షర కౌముది సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా తులసి వెంకట రమణాచార్యులు, గణపతి ఉపాసకులు డా నిర్మల సిద్ధరామే శ్వర శర్మ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ముదిగొండ శరభ లింగ శర్మ, సంస్కృత ఆం ధ్ర భాష అభిమానులు ముత్యం పేట మల్లికార్జున శర్మ, శ్రీ శైవ మహా పీఠం మల్కాజిగిరి శాఖ అధ్యక్షులు ఎస్పీ సతీశ్ చంద్ర, హైదరాబాద పబ్లిక్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కవి రచయిత ముదిగొండ సంతోష్ కుమార్ శర్మ ఆసిటెంట్ ప్రొఫ్సర్ డా.బి.ఆం.అంబేద్కర్ కాలేజీ సంస్కృత ఉపన్యాసకులు డా॥ కృష్ణమూర్తి, కవయిత్రి రచయిత్రి మూర్తి శ్రీదేవి తెలుగు అధ్యాపకురాలు సరోజ కొడాలి మానస ఆర్ట్స్ థియేటర్ సంస్థ కార్యదర్శి సాహితీవేత్త రఘుశ్రీ ఉపాధ్యాయురాలు ప్రణీత,శ్రీ నిర్మల శివానంద అధ్యక్షులు జ్యోతిష్య విద్వాంసులు నిర్మల రామ నాథ శర్మ సంస్కృత ఆంధ్ర పండితులు మున్నాలాల్ , శివ శ్రీ నిమ్మల నీలకంఠ శాస్త్రి గౌతమా స్ర వ్యవస్థాపక అధ్యక్షులు రాజ వీరేశ్వర శాస్త్రి బ్రహ్మానందం శర్మ తదితరుల పాల్గొన్నారు, సంస్కృతాంధ్ర అష్టావధానం చేసిన జంట కవులైన అవధాను లు, పృచ్ఛకులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈసంద ర్భంగా కవి రచయిత ముదిగొం డ సంతోష్ కుమార్ శర్మ కథ మంజీరా పిల్లల కథలు పుస్తకా విష్కరణ ఘనంగా నిర్వహించారు

# జనాభా నిష్పత్తి ప్రకారంగా విశ్వకర్మలకు నిధులు నియామకాలు కేటాయించాలి

**–అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి డిమాండ్**



హైదరాబాద్ జనవరి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జనాభా నిష్పత్తి ప్రకారంగా రావలసిన నిధులు నియామకాలు కేటాయించాలని అఖిల భారత విశ్వ కర్మ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి డిమాండ్ చేసారు. జాతీయ జన గణనలో కులగనన్న సమగ్ర చర్చ లో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మలకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందని, తెలంగాణ రావడానికి విశ్వకర్మలు ముఖ్య పాత్ర పోషించారని వారిలో మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్ సార్ శ్రీకాంత చారి లాంటి మహానుభావులు ఎందరో త్యాగఫలాలు తెలంగాణ రావడానికి కారణమని తెలియజేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ ని ఇయ్యకుండా గ్రామపం చాయతీ ఎన్నికల లో పోయి బీసీలను మోసం చేసిందని అలాగే ఇప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్లలో బీసీలకు న్యాయం చేయాలని 42 శాతం రిజర్వేషన్ ప్రకారంగా వారి వారి కులాల నిష్పత్తి ప్రకారంగా రిజర్వేషన్ సీట్లు ప్రకటించాలని కోరడం జరిగింది. విశ్వకర్మలకు కార్పొరేషన్ ప్రకటించాలని, 50 సం వత్సరాలు నిండిన విశ్వకర్మలకు 5000 రూపాయలు పెన్షన్ ఉండాలని, వృత్తిని ఉపాధిని కోల్పో యిన విశ్వకర్మలకు ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలియజేయడం జరిగింది. రోజురోజుకు బంగారం రేట్లు పెరుగుతున్న తరుణంలో స్వర్ణకారులకు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారి ఉపాధి కల్పించాలని కోరడం జరిగింది. కట్టె కోత మిషన పైన దాడులు, దొంగ బంగారం కేసుల నివారణని వెంటనే అడ్డుకట్ట వేయాలని తెలియజే యడం అనేక విషయాల పైన చర్చించడం జరిగింది ఈ కార్యక్రమంలో అఖిల భారత వి శ్వకర్మ మహాసభ గౌరవ అధ్యక్షు రాలు సావిత్రి పట్నాల, సలహా దారులు కనపర్తి లక్ష్మణాచారి, మహిళా కార్యదర్శి బోనాల ఇందిరా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, పాల్గొన్నారు.

# ఒకే బైక్‌పై ఐదుగురు మైనర్ల ప్రయాణం

**–తల్లిదండ్రుల సమక్షంలో పోలీసుల కౌన్సెలింగ్**

రాజన్న సిరిసిల్ల, జనవరి 31: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతూ, మైనర్లు ప్రమాదకరంగా వాహనాలు నడుపుతున్న ఘటనపై పోలీసులు సీరియస్‌గా స్పందించారు.ఒకే ద్విచక్ర వాహనంపై ఐదుగురు మైనర్లు ఎక్కి, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ తోటి వాహనదారులను భయాందోళనకు గురిచేసిన సంఘటన పోలీసుల దృష్టికి వచ్చింది.దీనిపై స్పందించిన వేములవాడ టౌన్ పోలీసులు, సదరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు.



అనంతరం వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వేములవాడ టౌన్ సిఐ మరియు ట్రాఫిక్ ఎస్ఐ సమక్షంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే బైక్‌పై ఐదుగురు ప్రయాణించడం వల్ల వాహనం అదుపు తప్పే ప్రమాదం ఉందని, ఇది ప్రాణాలకే ముప్పు అని పోలీసులు వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లు వాహనాలు నడపడం మోటారు వాహన చట్టం ప్రకారం నేరమని తెలిపారు.తల్లిదండ్రుల బాధ్యత:బి పిల్లల అల్లరిని ఉపేక్షించి వాహనాలు ఇస్తే, జరిగే అనర్థాలకు, చట్టపరమైన కేసులకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వకూడదనీ, పట్టణంలో రాష్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులు లేదా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని సిఐ స్పష్టం చేశారు.

# డీజీపీని కలిసిన రాజనాల శ్రీహరి



హైదరాబాద్ జనవరి 31(ఎక్స్ ప్రెస్ న్యూస్) మేడారం జాతర విజయవంతం అయిన సందర్భంగా హైదరాబాదులో డిజిపి కార్యంలో డిజిపి శివధర్ రెడ్డిని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి... మర్యాదపురం కలిసి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం రాజనాల మాట్లాడుతూమేడారం జాతర ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం యాత్రలో ఎక్కడ కూడా అవంతిక సంఘటన జరగకుండా ట్రాఫిక్ విషయంలో కానీ సమ్మక్క ప్రాంగణంలో గాని వాటర్ పెన్సిల్ గాని ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఈరోజు అధికారులు గాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇంత పెద్ద ఎత్తున మేడారం జాతర సక్సెస్ కావడానికి ప్రత్యేకంగా మంత్రులు వేం నరేందర్ రెడ్డి కి సీతక్క ,పోలీసులు ఉన్నతాధికారులకు ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసారు.

# డబ్ల్యూ.జే.ఐ జిల్లా శాఖ డైరీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



కరీంనగర్ జనవరి 31. వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటి కార్యవర్గ సభ్యులు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసారు. అనంతరం కలెక్టర్ జర్నలిస్టు లతో మాట్లాడుతూ డైరీని ముద్రించడం అభినందనీయమన్నారు. జిల్లా కమిటీకి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జిలాల్లోని జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేసేలా ఈ డైరీ ఉపయోగపడుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్, జిల్లా జిల్లా ఉపాధ్యక్షు లు మొగురం రమేష్, కోశాధికారి చిట్టిమళ్ళ మహేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, గంగం రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి

**– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ, జనవరి 31: ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరుకొన్నారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ఆంజనేయ స్వామి ఈవో నాగారపు శ్రీనివాస్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వారు మాట్లాడు తూ శ్రీనివాస్ గత 36 సంవత్స రాల నుంచి దేవాదాయ శాఖలో పంచలంచెలుగా పనిచే స్తూ ఈఓ స్థాయికి ఎదిగారని అన్నారు. రిటైర్మెంట్ అయినారు ప్రతి ఉద్యోగి ఉద్యోగ కాలంలో చేసిన మంచి పనులు పేరు ప్రతిష్టలు నిలబెడతాయి అని అన్నారు .



నాగారం శ్రీనివాస్ ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధి పరచడంలో విశేష కృషి చేశారని, రిటైర్మెంట్ తర్వాత కూడా వారి సేవలో అవసరమైనచో సూచన లు సలహాలు మిగతా సిబ్బందికి అందించాలని సూచించారు . సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానాన్ని టెంపుల్ సీటీ గా అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. గతంలో దేవస్థాన ఛైర్మన్గా పనిచేసిన సందర్భంగా నాంపల్లి దేవస్థానాన్ని,మామిడిపల్లి సీత రామ చంద్ర స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేశానని ప్రస్తుతం రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. శ్రీనివాస్ జీవితం శేష జీవితం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# మైనార్టీ ముస్లీం పకీర్లకు ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి

**– ఆలిండియా ఓబీసీ వ్యవస్థాపక అధ్యక్షులు పకీర్ జాంగిర్ పాషా**

వేములవాడ, జనవరి 31:వేములవాడ బీసీ సాధికారిత సంఘం కార్యాలయంలో శనివారం ముస్లీం మైనార్టీ పకీర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆలిండియా పసుపంచ్ ముస్లీం ఓబీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుజాంగిర్ పాషా హాజంయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ ముస్లీం బీసీ పకీర్లకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో మైనార్టీ ముస్లీం బీసీ పకీర్ పేరిట ప్రత్యేక ఆర్థిక కార్పొరేషన్ ఏర్పాటు చేసి,అట్టి కార్పొరేషన్ కు పాలక మండలిని నియమించి తగిన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం బీసీ సాధికారిత సంఘంరాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ మైనార్టీ ముస్లీం బీసీ పకీర్లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా వెనుకబడిపోతున్నందున,రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే,ముస్లీం మైనార్టీ బీసీ పకీర్ లకు కొంత వరకు లబ్ధి చేకురు నని, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర జాతీయ పార్టీల ఎంపీలు కృషి చేయాలన్నారు.

ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జ్ పొలాస నరేందర్ మాట్లాడుతూరాష్ట్రంలో ఉన్న మైనార్టీ ముస్లీం బీసీ పకీర్ కు చెందిన సుమారు 36 తెగల కులవృత్తులు రోజు రోజుకు అంతరించి పోతూ,ఉపాధి కరువై జీవనోపాధి కష్టంగా మారి ,బ్రతుకే బరువై కుటుంబాలు చితికి పోతున్నా యని,ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి వారి కులవృత్తులను కాపాడా లని,వారి కి పూర్వ వైభవం రావాలని, దర్జాగా బ్రతకాలని నరేందర్ అన్నారు.సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాంగిర్ పాషా ఆలిండియా ఓబీసీ ముస్లీం సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులును బీసీ నేతలు కొండ దేవయ్య పటేల్, పొలాస నరేందర్ శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో ముస్లీం మైనార్టీ బీసీ పఖీర్ నేతలు మహ్మద్ లాల్,చాంద్,లాడులల్లు,హైదర్,సల్మాన్,స్ అన్వర్,మహ్మద్ షఫీ, చాంద్,అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com